Follow: @ANNTELUGU

ANN తెలుగు

06-09-2026

# మహా పత్రిక


ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 238 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## రేవంత్ పాలిటిక్స్ తట్టుకునేదెవ్వరు?

తెలంగాణ రాజకీయ రణరంగంలో ఇప్పుడు ఎవరి నోట విన్నా ఒక్కటే మాట.. "రేవంత్ మార్క్ పాలిటిక్స్. పదవి ఏదైనా, పీఠం ఏదైనా తనదైన శైలిలో అడుగులు వేస్తూ రాజకీయ వ్యూహాలతో ప్రత్యర్థులను మాత్రమే కాదు, స్వపక్షంలోని అసమ్మతి గళాలను సైతం కట్టడి చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన స్ట్రాటజీ ఏంటో నిరూపించారు. కొండాసురేఖ కుమార్తె చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ కార్యకర్తలు భగ్గుమనగా, సీఎంను నేరుగా దూషించిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ హైకమాండ్ టైమొస్తే తానెంత కఠినంగా ఉంటానో మరోసారి చాటిచెప్పింది. పార్టీలో ఎవరైనా సరే, గీత దాటితే హైకమాండ్ ఉపేక్షించబోదనే కఠిన సందేశాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేశాయి. దీని ద్వారా కాంగ్రెస్ పార్టీలోని అసమ్మతులన్నీ.. అండర్ కంట్రోల్ లోకి వచ్చేశాయి. తాను సీఎం రేవంత్ ను ఎన్నడూ పల్లెత్తు మాట అనలేదని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా చెప్పాడు. నకిరేకల్ సభకు రాజగోపాల్ రెడ్డి హాజరుకాగా, ఆయనకు పొలిటికల్ టార్గెట్ ఫిక్స్ చేసి కేబినెట్ బెర్త్ ఖరారుచేసినట్లు తెలుస్తోంది. 'రేవంత్ 2.0' కోసం రోడ్‌మ్యాప్‌ను సీఎం సిద్ధం చేసుకున్నట్లు కనబడుతోంది. రాజకీయాల్లో చెక్ పెట్టడం వేరు.. చెస్ ఆడడం వేరు! రేవంత్ ఇప్పుడు కేవలం పావులు కదపడం లేదు.. బోర్డునే తన వైపునకు తిప్పుకుంటున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ వీకెండ్ హాట్ టాపిక్‌గా మారిన పరిణామాలపై

04



ఎఎన్ఎన్ - మహా పత్రికల
సీఈవో జర్నలిస్ట్
కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

టాప్ న్యూస్

### బీజేపీ చెత్తబుట్ట కాదు



- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే మైండ్ గేమ్
- బీజేపీ జాతీయ నేత మురళీధర్ సంచలన రియాక్షన్

03

### సురేఖను కాపాడేందుకు చాలా ప్రయత్నించాం



- కొండా సురేఖ బర్తరఫ్ పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమే
- క్యాబినెట్ విస్తరణపై ఇప్పట్లో చర్చే లేదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

03

### 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు



- మంత్రి నారా లోకేశ్ ప్రకటన
- ఓటమిని అంగీకరించడం నా డిక్షనరీలో లేదు

03

## బీఆర్ఎస్ అనే మొక్క

# తెలంగాణలో మొలకెత్తదు



- ఈ నెలాఖరులో వస్తా.. సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తా
- వచ్చే నెలలో సిద్దిపేట వస్తా.. కాపోకండి కల్వకుంట్ల కుటుంబమా?
- సీట్లు పెరిగితే 117.. ఇపుడున్న సీట్లయితే 90 పక్కాగా గెలుస్తాం
- నకిరేకల్ సభలో బీఆర్ఎస్ పై భగ్గుమన్న సీఎం రేవంత్ రెడ్డి
- నాకు సంస్కారం ఉంది కాబట్టి,, మీరు రోడ్లపై తిరుగుతున్నారు

సిరిసిల్ల, సిద్దిపేటలో కూడా కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



**నకిరేకల్, మహా**

ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు

మిగతా 2వ పేజీలో








## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద

# ఏఐ డేటా సెంటర్



### 250 ఎకరాల విస్తీర్ణంలో.. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్, మహా** : హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.

**రూ.70వేల కోట్ల పెట్టుబడి!**

హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు

మిగతా 2వ పేజీలో

### అమెరికాను వెనక్కునెట్టి..

- రెండేళ్ళలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్

02





## రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

02

అధికారులకు కీలక సూచనలు

### ఏపీలో జెడ్పీల పునర్వ్యవస్థీకరణ

- 13 స్థానంలో 28 జిల్లా పరిషత్‌లు.
- మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త జెడ్పీలు.
- పాలకవర్గాల పదవీకాలం ముగిసిన వెంటనే కొత్త వ్యవస్థ అమలు.

02


### బుద్గాంలో ఎన్‌కౌంటర్

లష్కరే తోయిబా కీలక కమాండర్ యాసిర్ హతం

- పహల్గాం కుట్రలో సులేమాన్‌కు సన్నిహితుడిగా గుర్తింపు.
- ఆర్మీ–జమ్మూకశ్మీర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్.
- భారీగా ఆయుధాలు స్వాధీనం.

02





### విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- డ్రగ్స్ వ్యసనం, అధిక స్క్రీన్ టైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి.
- ఎన్ ఈ పి ప్రకారం వాస్తవ జీవన నైపుణ్యాలు బోధించాలి.
- ప్రధాని నరేంద్ర మోదీ.

03

### గురువులే భవిష్యత్ కథానాయకులను తీర్చిదిద్దుతారు

- 55 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేశాం.
- టీచర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది.
- సీఎం రేవంత్‌రెడ్డి

03



# కృష్ణాష్టమి పోటీల్లో కంది సుప్రీత్ హరిల్ రెడ్డికి బహుమతి

**మణికొండ, మహా :** మణికొండ అల్కాపురి కాలనీలో హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టికొట్టడంలో విజయం సాధించి కంది సుప్రీత్ హరిల్ రెడ్డి బహుమతి గెలుచుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ పార్క్ లో ఈ కార్యక్రమం జరగ్గా, నిర్వాహకులు సుప్రీత్ హరిల్ రెడ్డికి బహుమతి ప్రధానం చేసి అభినందించారు. సుప్రీత్ కొల్లూరు గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ లో ఏడవతరగతి చదువుతున్నాడు.



# మొన్న కూల్చారు... నేడు మళ్ళీ కడుతున్నారు

**మియాపూర్ సర్కిల్ లో.. సిఎంసీ అధికారులకు సవాల్ విసురుతున్న అక్రమ నిర్మాణదారులు**

**మహా, శేరిలింగంపల్లి :** సిఎంసి మియాపూర్ సర్కిల్ పరిధిలో ఒకవైపు కూల్చివేతలు జరుగుతున్నా.. మరోవైపు అక్రమ నిర్మాణాల సైతం యాదేచ్ఛగా కొనసాగుతున్నాయి.. అక్ర నిర్మాణాలను గుర్తించి సీఎంci అధికారులు, కూల్చివేత్తలు చేసినప్పటికీ... అక్రమ నిర్మాణదారులు మరుసటి రోజు నుంచే తిరిగి నిర్మాణం చేపట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఎన్ని ఫిర్యాదులు చేసుకున్నా... తాము మాత్రం తగ్గేదేలే అంటూ మళ్ళీ నిర్మాణం చేపడుతూ సిఎంసీ అధికారులకు సవాల్ విసురుతున్నారు. వివరాల్లోకి వెళ్తే మియాపూర్ సర్కిల్ నుంచి బొల్లారం వెళ్లే ప్రధాన మార్గముకు ఆనుకొని ఓ అక్రమ నిర్మాణదారుడు సీఎంసీ అధికారుల నుంచి ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండానే అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నాడు. ఇందుకు ముందస్తుగా సీఎంసి అధికారుల నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతి తీసుకోకపోవడంతో వారం రోజుల క్రితం సిఎంసి అధికారులు అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డును నేలమట్టం చేశారు. ఇది గడిచిన వారం రోజుల తర్వాత అక్ర నిర్మాణదారుడు తిరిగి నిర్మాణ కొనసాగించడం ప్రస్తుతం చర్చని అంశంగా మారింది. కాగా అధికారులు పూర్తిస్థాయి కూల్చివేతలు కాకుండా, నామమాత్రంగా కూల్చడం వెనుక సదరు నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానితో రాత్రికి రాత్రి అనుమతి లేని నిర్మాణాన్ని పూర్తిచేసి, డోంట్ కేర్ అనేలా నిర్మాణదారుడు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. కూల్చివేతలకు ప్రత్యేకించి విలువైన సమయాన్ని కేటాయిస్తున్న అధికారులు పూర్తిస్థాయి కూల్చివేతలు చేపడితే మరలా తిరిగి నిర్మించడం దాదాపు సాధ్యం కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూల్చిన మరుసటిరోజే తిరిగి చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



# రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

**అధికారులకు కీలక సూచనలు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని వీలైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచనలు చేశారు. సభ్యులకు అందించే మెటీరియల్ ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదేశించారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు అందే విధంగా సమన్వయం చేసుకోవాలని సూచనలు చేశారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు.

# బీఆర్ఎస్ అనే మొక్క తెలంగాణలో మొలకెత్తదు

( మొదటి పేజీ తరువాయి )

ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలాఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**నాకు సంస్కారం ఉంది కాబట్టే..**

నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు అంటూ సీఎం ఫుల్ ఫైర్ అయ్యారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి అని అన్నారు.

**బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు**

ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

**రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం**

వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు.



**అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం**

నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగ్గా, సీఎం పర్యటనలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, , పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్, మందుల సామేలు, బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి

నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.

## పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిఎన్నిక

పాలకుర్తి,05 మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ముక్కెర శ్రీనివాస్‌ను పాలకుర్తి సర్పంచ్ పెద్దపెల్లి తిరుమల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముక్కెర శ్రీనివాస్‌కు నాయకులు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బుద్గాంలో ఎన్‌కౌంటర్

**శ్రీనగర్: మహా :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతలో భద్రతా బలగాలకు కీలక విజయం లభించింది. బుద్గాం జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ)కు చెందిన కీలక కమాండర్ యాసిర్‌ను భద్రతా బలగాలు హతమార్చాయి. పక్కా సమాచారంతో భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఘటనాస్థలంలో ఏకే47 రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బుద్గాం జిల్లాలోని ఉగ్రవాదుల కదలికలపై భద్రతా సంస్థలకు అందిన పక్కా సమాచారంతో ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. అనుమానిత ప్రాంతాన్ని భద్రతా బలగాలు చుట్టుముట్టి గాలింపు చర్యలు చేపట్టిన సమయంలో ఉగ్రవాదుల నుంచి కాల్పులు జరగడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో లష్కరే తోయిబా టాప్ కమాండర్‌గా గుర్తించిన యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు.యాసిర్ లష్కరే తోయిబాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిగా భద్రతా సంస్థలు గుర్తించినట్లు సమాచారం. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడికి కుట్రపన్నిన సులేమాన్‌కు అతడు సన్నిహితుడిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో యాసిర్ హతం కావడం భద్రతా బలగాలకు ప్రాధాన్యమైన పరిణామంగా మారింది.పహల్గాం దాడి కుట్రకు సంబంధించిన ఉగ్రవాద నెట్‌వర్క్‌పై భద్రతా సంస్థలు దృష్టి సారించిన నేపథ్యంలో యాసిర్ కదలికలపై నిఘా కొనసాగినట్లు తెలుస్తోంది. అందిన సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం బుద్గాంలో ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. సంయుక్త బలగాల సమన్వయంతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో లక్ష్యాన్ని గుర్తించి చర్యలు చేపట్టారు.ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలంలో భద్రతా బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో ఏకే47 రైఫిల్, పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరిన్ని ఆయుధాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సామగ్రి ఏమైనా ఉన్నాయా అనే కోణంలోనూ గాలింపు కొనసాగించినట్లు తెలుస్తోంది.యాసిర్ హతంతో పహల్గాం దాడి వెనుక ఉన్న ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తులో కీలక సమాచారం లభించే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. అతడికి ఉన్న సంబంధాలు, ఆయుధాల సరఫరా వ్యవస్థ, స్థానికంగా ఉగ్రవాదులకు అందుతున్న సహకారం వంటి అంశాలపై భద్రతా సంస్థలు దృష్టి సారించే అవకాశం ఉంది.జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఆర్మీ, పోలీసు, ఇతర భద్రతా సంస్థలు సంయుక్తంగా ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. ఉగ్రవాదుల కదలికలపై అందుతున్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని లక్ష్యిత గాలింపు చర్యలు చేపడుతున్నారు. బుద్గాం ఎన్‌కౌంటర్ కూడా ఈ సంయుక్త ఆపరేషన్లలో భాగంగా జరిగినట్లు తెలుస్తోంది.యాసిర్ వంటి కీలక కమాండర్ హతం కావడం వల్ల లష్కరే తోయిబా నెట్‌వర్క్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లుగా భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఎన్‌కౌంటర్ అనంతరం కూడా బుద్గాం పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఉగ్రవాదుల మిగిలిన మాడ్యూళ్లు, వారికి సహకరిస్తున్న వ్యక్తుల వివరాలను గుర్తించేందుకు దర్యాప్తు సాగుతోంది.



# డ్రంక్ డ్రైవ్ కేసుల్లో కఠిన చర్యలు..

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్05,** రామగుండం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 16 వ్యక్తులను గోదావరిఖని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వెంకట సచిన్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు.వారిలో 15 వ్యక్తులుకు కోర్టు మొత్తం రూ.41,500 జరిమానా విధించింది. కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనులు చేయించింది. మరో వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష విధించడంతో అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు కారణమవుతున్నారని, ఇకపై డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తప్పని సరిగా కలిగి ఉండాలని సూచించారు.

# రైతులకు న్యాయం చేయాలి

**సిద్దిపేట, మహా:** రైతుల సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సిద్దిపేట జిల్లా హబ్సిపూర్‌లో నిర్వహించిన 'రైతు పొలికేక' ధర్నాలో ఆయన పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు మళ్లీ ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఉచిత విద్యుత్ ఉత్త కరెంట్‌గా మారిందని, రైతుబంధు పథకానికి ప్రభుత్వం ఎసరు పెట్టిందని ఆరోపించారు. మిల్లర్లు, బ్రోకర్ల విషయంలో ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. పంటలకు సరైన ధర, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైతే సీఎం పదవి నుంచి రేవంత్‌రెడ్డి దిగిపోవాలని హరీశ్‌రావు అన్నారు. రైతుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# అమెరికాను వెనక్కునెట్టి..

**రెండేళ్ళలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్**

**మహా డెస్క్:** మెట్రో రైలు రంగంలో భారత్ సరికొత్త రికార్డును ఆవిష్కరించబోతున్నది. రాబోయే రెండేళ్లలో అమెరికాను వెనక్కి నెట్టి.. చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో రైలు నెట్ వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించనుంది. ఈ విషయాన్ని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ తెలిపారు. ఒకప్పుడు కేవలం కొన్ని నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు ఇప్పుడు దేశంలోని 26 నగరాలకు విస్తరించాయని మంత్రి చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్త మార్గాలు పెద్ద ఎత్తున అందుబాటులోకి రానుండటంతో భారత్ మెట్రో నెట్ వర్క్ మరింత వేగంగా పెరగనుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో దేశంలో కేవలం 5 నగరాల్లో 245 కిలోమీటర్ల మేర మాత్రమే మెట్రో రైలు మార్గాలు అందుబాటులో ఉండేవని మనోహర్ లాల్ గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, దేశవ్యాప్తంగా 26 నగరాల్లో సుమారు 1,170 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. 12 ఏళ్లలోనే దేశ మెట్రో నెట్ వర్క్ దాదాపు ఐదు రెట్లు పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో విస్తరణకు పెద్దపీట వేయడంతో కొత్త నగరాల్లోనూ మెట్రో రైలు ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు . భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్ వర్క్ కలిగిన దేశంగా ఉంది. చైనా అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు పూర్తవుతూ, నిర్మాణంలో ఉన్న మార్గాలు అందుబాటులోకి వస్తే రెండేళ్లలో అమెరికాను భారత్ అధిగమించే అవకాశం ఉందని మనోహర్ లాల్ అన్నారు.




# ఏపీలో జెడ్పీల పునర్వ్యవస్థీకరణ

- 13 స్థానంలో 28 జిల్లా పరిషత్‌లు.
- మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త జెడ్పీలు.
- పాలకవర్గాల పదవీకాలం ముగిసిన వెంటనే కొత్త వ్యవస్థ అమలు.

**అమరావతి:** మహా. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌ల స్థానంలో 28 కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు కూడా జిల్లా పరిషత్‌లను మంజూరు చేసింది. ఈ మార్పులతో జిల్లా పరిషత్ వ్యవస్థను కొత్త జిల్లాల భౌగోళిక, పరిపాలనా నిర్మాణానికి అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త జెడ్పీల ఏర్పాటుతో పాటు అదనంగా 15 జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో), డిప్యూటీ సీఈవో పోస్టులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త జిల్లాల పరిధిలో జిల్లా పరిషత్‌ల పరిపాలన సజావుగా కొనసాగేందుకు అవసరమైన అధికార యంత్రాంగాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 24తో ముగియనుంది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన వెంటనే కొత్తగా ఏర్పాటు చేసిన 28 జిల్లా పరిషత్‌ల వ్యవస్థ అమల్లోకి రానుంది. దీంతో పాత 13 జెడ్పీల స్థానంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన 28 జెడ్పీలు పనిచేయనున్నాయి. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం జిల్లా పరిషత్‌ల సంఖ్యను కూడా అదే ప్రాతిపదికన పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న జెడ్పీ వ్యవస్థను కొత్త జిల్లాల పరిపాలనా నిర్మాణానికి అనుగుణంగా మార్చడం ద్వారా స్థానిక సంస్థల పరిపాలనను మరింత వికేంద్రీకరించే అవకాశం ఏర్పడనుంది. మార్కాపురం, పోలవరం జిల్లాలకు ప్రత్యేక జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేయడం ఈ పునర్వ్యవస్థీకరణలో కీలక మార్పుగా నిలవనుంది. కొత్త జిల్లాలకు ప్రత్యేక జెడ్పీలు ఏర్పాటుకావడంతో ఆయా ప్రాంతాల స్థానిక సంస్థలకు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. కొత్త జెడ్పీలతో పాటు అవసరమైన సిబ్బంది, అధికారుల పోస్టులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంతో జిల్లా పరిషత్ కార్యాలయాల పరిపాలనా నిర్మాణం కూడా మారనుంది. 15 అదనపు సీఈవో , డిప్యూటీ సీఈవో పోస్టుల మంజూరుతో కొత్తగా ఏర్పడే జిల్లా పరిషత్‌లకు పరిపాలనా నాయకత్వం కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత కొత్త జెడ్పీల వ్యవస్థ అమల్లోకి రావడంతో స్థానిక సంస్థల పరిపాలనలో కొత్త దశ ప్రారంభం కానుంది. కొత్త జిల్లాల పరిధిలోని మండలాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల సమన్వయం, జిల్లా స్థాయి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో కొత్త జెడ్పీలు కీలక పాత్ర పోషించనున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు జరిగినప్పటికీ పాత జిల్లా పరిషత్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో ఏర్పడిన పరిపాలనా అసమానతను తొలగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై జిల్లా పరిషత్‌ల పరిపాలనా పరిధి ఆయా కొత్త జిల్లాల సరిహద్దులకు అనుగుణంగా ఉండనుంది. ఈ పునర్వ్యవస్థీకరణతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. కొత్త జెడ్పీల ఏర్పాటు, వాటి పరిధి, అధికార యంత్రాంగం తదితర అంశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగిసే నాటికి ప్రభుత్వం చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు కొనసాగుతున్నాయి.

# విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- డ్రగ్స్ వ్యసనం, అధిక స్క్రీన్ టైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి.
- ఎన్ ఈ పి ప్రకారం వాస్తవ జీవన నైపుణ్యాలు బోధించాలి.
- ప్రధాని నరేంద్ర మోదీ.



**న్యూఢిల్లీ: మహా :** విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యసనంపై అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. పిల్లల్లో అధికంగా పెరుగుతున్న స్క్రీన్ టైమ్‌ను తగ్గించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని అన్నారు. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో శనివారం ప్రధానమంత్రి మోదీ భేటీ అయ్యారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 82 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు అందించిన నేపథ్యంలో వారితో ప్రధాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్య, ప్రవర్తన, ఆరోగ్యం, సాంకేతిక వినియోగం, జీవన నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని మోదీ ప్రస్తావించారు.విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు గమనించాలని ప్రధాని సూచించారు. పిల్లలు పాఠశాలలో ఎలా ప్రవర్తిస్తున్నారు, వారి ఆలోచనా విధానం ఎలా మారుతోంది, తోటి విద్యార్థులతో ఎలా మెలుగుతున్నారు అనే అంశాలపై టీచర్లు దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

యువతను డ్రగ్స్ వ్యసనం నుంచి కాపాడాల్సిన బాధ్యతలో ఉపాధ్యాయులు కూడా భాగస్వాములు కావాలని మోదీ సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా వారిలో అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులతో కలిసి తగిన శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.

పిల్లల్లో అధికంగా పెరుగుతున్న స్క్రీన్ టైమ్‌పైనా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగాన్ని అవసరమైన స్థాయికి పరిమితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లకు కేటాయించకుండా తల్లిదండ్రులు కూడా వారితో కలిసి మొబైల్ వినియోగాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలని సూచించారు.

మొబైల్ వినియోగాన్ని తగ్గించడం కేవలం పిల్లలకు మాత్రమే సంబంధించిన బాధ్యత కాదని, తల్లిదండ్రులు కూడా తమ ప్రవర్తన ద్వారా వారికి ఆదర్శంగా నిలవాలని మోదీ సూచించినట్లు తెలిపారు. కుటుంబంలో డిజిటల్ పరికరాల వినియోగానికి సమతుల్యత తీసుకురావడం ద్వారా పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులను క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలని ప్రధాని సూచించారు. పిల్లలు పుస్తకాలతో పాటు మైదానంలోనూ సమయం గడపాలని, తమలోని సృజనాత్మకతను వెలికితీసే కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అన్నారు. క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థలో జాతీయ విద్యా విధానం (NEP) నిర్దేశించిన విధంగా వాస్తవ జీవన నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మోదీ సూచించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలలోని అంశాలను నేర్చుకోవడంతో పాటు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యాలను కూడా పొందేలా బోధన సాగాలని అన్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి మార్కులు సాధించేలా చేయడం మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. పిల్లల ప్రవర్తన, ఆరోగ్యం, సాంకేతిక వినియోగం, సృజనాత్మకత, క్రీడలు, జీవన నైపుణ్యాలపై సమగ్రంగా దృష్టి పెట్టాలని సూచించారు.జాతీయ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో భేటీ సందర్భంగా మోదీ చేసిన సూచనలు పాఠశాల విద్యలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని మరోసారి స్పష్టం చేశాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తే పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, సృజనాత్మక ఆలోచన, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించవచ్చని ప్రధాని సూచించారు.

## ఏపీ ఇన్ ఛార్జిగా పీవీ మోహన్

**త్వరలో కర్నాటక, తెలంగాణ ఇన్ ఛార్జిల మార్పు**

**అమరావతి, సెప్టెంబరు 5:** కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇంచార్జిగా పి.వి మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాణిక్యం ఠాగూర్ స్థానంలో పి.వి. మోహన్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. పంజాబ్ ఇన్ ఛార్జిగా సచిన్ పైలట్, గుజరాత్ ఇన్ ఛార్జిగా రణదీప్ సింగ్ సూర్జేవాలాను నియమించారు.

## బహిరంగ చర్చకు రావాలి

**కరీంనగర్, మహా:** మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మండిపడ్డారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకే రసమయి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కళాకారుడిగా, రాజకీయ నాయకుడిగా గతంలో పనిచేసిన రసమయి తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పనితీరుపై రసమయి చేసిన విమర్శలకు కవ్వంపల్లి ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మానకొండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి.

# గురువులే భవిష్యత్ కథానాయకులను తీర్చిదిద్దుతారు

- 55 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేశాం.
- టీచర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది.
- సీఎం రేవంత్‌రెడ్డి

**కొడంగల్: మహా.** "పిల్లలను భవిష్యత్ కథానాయకులుగా తీర్చిదిద్దేది టీచర్లే. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ముఖ్యమంత్రి అయ్యాను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

కొడంగల్‌లో శనివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు, ఉపాధ్యాయుల సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

2023 డిసెంబరు 7న తమ ప్రభుత్వం ఏర్పడే నాటికి దేశంలో తెలంగాణ 28వ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం 17వ స్థానానికి చేరుకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం విద్యా రంగంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగగలిగాడంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రాధాన్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ నియామకాల విషయంలో గత పరిస్థితులను సీఎం ప్రస్తావించారు. గతంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో, నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయో స్పష్టత ఉండేది కాదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు మొత్తం ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు.డీఎస్సీ ప్రక్రియను కేవలం నోటిఫికేషన్ జారీ చేయడంతోనే ఆపకుండా పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టామని రేవంత్‌రెడ్డి అన్నారు. "55 రోజుల్లోనే పరీక్షలు, నియామకాలు జరిగిపోయాయి" అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరతను అధిగమించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.



ఉపాధ్యాయుల పదోన్నతుల అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఎలాంటి సమస్యలు లేకుండా 25,950 మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామని తెలిపారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు విద్యా వ్యవస్థలో పరిపాలనా పరమైన ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు.టీచర్ల సమస్యలపై కూా రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సిన అవసరం లేదని అన్నారు. "టీచర్లు.. రెండేళ్లు మీ సమస్యల గురించి అడగకండి.. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే బాధ్యతను తానే తీసుకుంటానని స్పష్టం చేశారు.

విద్యా వ్యవస్థ గతంలో ఎదుర్కొన్న పరిస్థితులపై రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. "విద్యా వ్యవస్థను గత ప్రభుత్వమే ముంచింది" అని ఆరోపించారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు. పిల్లలకు కేవలం పాఠ్యాంశాలు బోధించడం మాత్రమే కాకుండా వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదేనని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివి తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన విషయాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తనకున్న నమ్మకాన్ని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తనలాంటి అవకాశాలు లభించేలా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ చెత్తబుట్ట కాదు

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే మైండ్ గేమ్
- బీజేపీ జాతీయ నేత మురళీధర్ సంచలన రియాక్షన్

**హైదరాబాద్, మహా :** మాజీమంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరతారనే వార్తల నేపథ్యంలో ఆ పార్టీ సీనియర్ నేత పి.మురళీధర్ రావు ఘాటుగా స్పందించారు. బీజేపీ ఇతర పార్టీల నుంచి వచ్చే అసంతృప్త నేతలను చేర్చుకునే చెత్తబుట్ట కాదని ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సంక్షోభం, సమస్యలు బయటపడుతున్న సమయంలోనే బీజేపీని ప్రతి ఊహాగాన రాజకీయ కథనంలోకి లాగడానికి మీడియా ఎందుకంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు. ఇది ప్రజల దృష్టిని మళ్లించేందుకు జరుగుతున్న కుట్రని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని మురళీధర్ రావు పేర్కొన్నారు. సంస్కృతి, సిద్ధాంతం, రాజకీయ విలువల పరంగా బీజేపీ వేరు అని, కేవలం ఇతర పార్టీల అసంతృప్త నేతలకు స్థావరం కావడం ద్వారా ప్రత్యామ్నాయం కాలేమని తేల్చిచెప్పారు. బీజేపీ ఒక ప్రత్యామ్నాయ శక్తి అని వ్యాఖ్యానించారు.

# క్రికెటర్లకు ప్రత్యేక వసతులు కుదరవు

- బీసీసీఐ విజ్ఞప్తిని తిరస్కరించిన ఐవోఏ.
- సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటే అభ్యంతరం లేదు.
- ఐవోఏ సీఈఓ రఘురామ్ అయ్యర్.

**న్యూఢిల్లీ:మహా :** ఆసియా క్రీడల్లో భారత క్రికెటర్లకు ప్రత్యేక వసతి సదుపాయాలు కల్పించాలన్న బీసీసీఐ విజ్ఞప్తికి భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) సానుకూలంగా స్పందించలేదు. ఆసియా క్రీడల్లో పాల్గొనే ఇతర క్రీడాకారులకు వర్తించే నిబంధనలే క్రికెటర్లకూ వర్తిస్తాయని ఐవోఏ స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే క్రికెటర్ల కోసం బీసీసీఐ సొంతంగా వసతి సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఐవోఏ సీఈఓ రఘురామ్ అయ్యర్ స్పష్టం చేసినట్లు కథనాలు వెల్లడించాయి.జపాన్ వేదికగా శనివారం నుంచి ఆసియా క్రీడల ఏర్పాట్లపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో వసతి సదుపాయాలు, క్రికెట్ మైదానంలోని పిచ్ నాణ్యతపై ఇప్పటికే పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా క్రీడాకారులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన గదులు చాలా చిన్నగా ఉన్నాయన్న వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు వసతి విషయంలో బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు కోరినట్లు సమాచారం.క్రికెటర్ల వసతి ఏర్పాట్లకు సంబంధించి బీసీసీఐ సీఈఓ హేమంగ్ అమిన్ తమను సంప్రదించినట్లు ఐవోఏ సీఈఓ రఘురామ్ అయ్యర్ తెలిపారు. ఈ అంశంపై ఇద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసియా క్రీడల సందర్భంగా క్రికెటర్లకు అందుబాటులో ఉండే సదుపాయాలను స్వయంగా పరిశీలించేందుకు జపాన్‌కు ప్రత్యేక బృందాన్ని పంపించాలన్న బీసీసీఐ ఆలోచనకు ఐవోఏ అంగీకరించినట్లు తెలిపారు.జపాన్‌లో నిర్వాహకులు కల్పిస్తున్న వసతి, ఇతర సౌకర్యాలను పరిశీలించిన తర్వాత వాటిని బీసీసీఐ ఉపయోగించుకోవాలా? లేక క్రికెటర్ల కోసం స్వయంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలా? అన్నది బీసీసీఐ నిర్ణయించుకోవచ్చని అయ్యర్ స్పష్టం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. బీసీసీఐ సొంతంగా వసతి సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటే ఐవోఏకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన వెల్లడించారు.




# సురేఖను కాపాడేందుకు చాలా ప్రయత్నించాం



**హైదరాబాద్ మహా :** 'కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం.. ఆమె విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. కానీ బర్తరఫ్ విషయంలో ఏఐసీసీ నిర్ణయమే తుది నిర్ణయంగా మారింది అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. సురేఖ వ్యవహారంలో పార్టీ అధిష్ఠానం ఒప్పుకోలేదని, ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించడం పూర్తిగా ఏఐసీసీ తీసుకున్న నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో మహేశ్‌కుమార్ గౌడ్ కొండా సురేఖ బర్తరఫ్, ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, మంత్రివర్గ విస్తరణతో పాటు బీసీ అంశాలపై మాట్లాడారు. సురేఖ విషయంలో పార్టీ నాయకత్వం నుంచి సాధ్యమైనంత వరకు రక్షించే ప్రయత్నం జరిగిందని, అయినప్పటికీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంలో ఏఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని మార్చలేకపోయామని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం బాధాకరమైన పరిణామమే అయినప్పటికీ, పార్టీ క్రమశిక్షణ విషయంలో రాజీపడే పరిస్థితి లేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఇప్పటికే స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే అధిష్ఠానం చర్యలు తీసుకుందని ఆయన వెల్లడించారు. పార్టీ పరిధులు దాటి ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్న సందేశాన్ని ఈ పరిణామం ఇచ్చిందని పేర్కొన్నారు. సురేఖ విషయంలో తాము తమ వంతు ప్రయత్నం చేశామని చెప్పిన మహేశ్‌కుమార్ గౌడ్.. చివరకు ఏఐసీసీ నిర్ణయమే అమలులోకి వచ్చిందని తెలిపారు. సురేఖను పార్టీ నుంచి దూరం చేయాలన్న ఉద్దేశం తమకు లేదని, ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగాలని పార్టీ కోరుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పార్టీలోనే ఉంటే భవిష్యత్తులో ఆమెకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. సురేఖ వ్యవహారంలో ఢిల్లీలో జరిగిన చర్చలపై కూడా మహేశ్‌గౌడ్ స్పష్టత ఇచ్చారు. సురేఖ అంశం, అలాగే చిన్నారెడ్డి వ్యవహారంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అంశం మాత్రం చర్చకు రాలేదని వెల్లడించారు. ఏఐసీసీ నుంచి క్యాబినెట్ విస్తరణకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేపట్టాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపై కూడా ఆయన స్పందిస్తూ.. ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. దీంతో మంత్రివర్గ విస్తరణపై జరుగుతున్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడినట్లేనని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. సురేఖ వ్యవహారంలో క్రమశిక్షణ అంశానికే అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చిందని మహేశ్‌గౌడ్ తెలిపారు. పార్టీలో అభిప్రాయాలు, అసంతృప్తులు వ్యక్తం చేసేందుకు అనేక వేదికలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి సంబంధించిన సమస్యలను అంతర్గతంగా చర్చించుకునే అవకాశాలు ఉన్నప్పుడు బహిరంగంగా పార్టీ పరిమితులు దాటి మాట్లాడటం సరికాదన్న సంకేతాన్ని ఆయన ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సురేఖ చేసిన వ్యాఖ్యలు ఆవేదన, ఆగ్రహంతో వచ్చినవిగా భావిస్తున్నామని, భవిష్యత్తులో ఆమె మాటతీరు మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అదే సమయంలో కాంగ్రెస్‌లోనే కొనసాగితే ఆమెకు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీసీలకు కాంగ్రెస్ అధిక ప్రాధాన్యం ఇస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కులం, ప్రాంతం వంటి అంశాల ఆధారంగా క్రమశిక్షణ చర్యలను చూడలేమని, పార్టీ నిర్ణయాలు క్రమశిక్షణ ప్రాతిపదికన ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణలో బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయ కార్యక్రమంలో భాగంగా ముందుకు తీసుకెళ్తోందని ఆయన గతంలోనూ వెల్లడించారు. కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. సామాజిక న్యాయం కోసం చేపట్టిన ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కుల సర్వేను జాతీయ స్థాయిలో సామాజిక న్యాయానికి ఉపయోగపడే నమూనాగా కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే ప్రస్తావించింది. రాహుల్‌గాంధీ ఆశయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, కుల సర్వే ద్వారా లభించిన సమాచారాన్ని సామాజిక న్యాయ విధానాలకు ఉపయోగించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీ హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. రాబోయే వంద రోజుల పాటు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల హక్కుల కోసం చేపట్టే ఈ ఉద్యమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు మద్దతుగా నిలవాలని కోరారు.

## ఆక్వా రైతుల ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం.

**గుడివాడ:మహా:** ఆక్వా రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపిందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆక్వా రైతుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలకు ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు మత్స్యశాఖ జీవో నంబర్ 1756ను విడుదల చేసిందని చెప్పారు. ఆక్వా రైతులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై మత్స్యశాఖ జారీ చేసిన జీవోపై రైతు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ ప్రజావేదికలో శనివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఆక్వా రైతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే రాముకు వారు ధన్యవాదాలు తెలిపారు.ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. రైతుల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లిన అనంతరం సానుకూలంగా స్పందించారని, సంబంధిత శాఖ ద్వారా తక్షణమే చర్యలు తీసుకునేలా చూశారని పేర్కొన్నారు.మత్స్యశాఖ తాజాగా విడుదల చేసిన జీవో 1756 ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాము అన్నారు. జీవోలో పొందుపరిచిన నిబంధనలు, ప్రభుత్వం కల్పించిన వెసులుబాట్లను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.తమ సమస్యలను గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదని ఆక్వా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.

# రేవంత్ మార్క్ పొలిటిక్స్ తట్టుకునేదెవ్వరు?



తెలంగాణ రాజకీయ రణరంగంలో ఇప్పుడు ఎవరి నోట విన్నా ఒక్కటే మాట.. "రేవంత్ మార్క్ పాలిటిక్స్. పదవి ఏదైనా, పీఠం ఏదైనా తనదైన శైలిలో అడుగులు వేస్తూ రాజకీయ వ్యూహాలతో ప్రత్యర్థులను మాత్రమే కాదు, స్వపక్షంలోని అసమ్మతి గళాలను సైతం కట్టడి చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన స్ట్రాటజీ ఏంటో నిరూపించారు. కొండా సురేఖ కుమార్తె చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ కార్యకర్తలు భగ్గుమనగా, సీఎంను నేరుగా దూషించిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ హైకమాండ్ టైమొస్తే తానెంత కఠినంగా ఉంటానో మరోసారి చాటిచెప్పింది. పార్టీలో ఎవరైనా సరే, గీత దాటితే హైకమాండ్ ఉపేక్షించ బోదనే కఠిన సందేశాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేశాయి. దీని ద్వారా కాంగ్రెస్ పార్టీ లోని అసమ్మతులన్నీ.. అండర్ కంట్రోల్ లోకి వచ్చేశాయి. తాను సీఎం రేవంత్ ను ఎన్నడూ పల్లెత్తు మాట అనలేదని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా చెప్పాడు. నకిరేకల్ సభకు రాజగోపాల్ రెడ్డి హాజరుకాగా, ఆయనకు పొలిటికట్ టార్గెట్ ఫిక్స్ చేసి కేబినెట్ బెర్త్ ఖరారుచేపినట్లు తెలుస్తోంది. 'రేవంత్ 2.0' కోసం రోడ్‌మ్యాప్‌ను సీఎం సిద్ధం చేసుకున్నట్లు కనబడుతోంది. రాజకీయాల్లో చెక్ పెట్టడం వేరు.. చెస్ ఆడడం వేరు! రేవంత్ ఇప్పుడు కేవలం పావులు కదపడం లేదు.. బోర్డునే తన వైపునకు తిప్పుకుంటున్నారు.

**తెలంగాణ రాజకీయాల్లో ఈ వీకెండ్ హాట్ టాపిక్‌గా మారిన పరిణామాలపై ఎఎన్ఎన్ - మహా పత్రికల సీఈవో జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

కొండా సురేఖ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ ఎలా డీల్ చేస్తుందని అందరూ ఎదురుచూశారు. కొండాసురేఖ బర్తరఫ్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకత కాంగ్రెస్ హైకమాండ్ ను మెప్పించగా, ఇది తొలి సంఘటన కాకపోవడంతో ఆమెకు ఇంటా బయటా మద్దతు కరువైంది. కొండా సురేఖ బర్తరఫ్ కు ముందే ఢిల్లీ వెళ్ళి తన వద్ద ఉన్న అస్త్రాలన్నీ చెప్పేశారు. దీంతో కొండా బర్తరఫ్ డ్యామేజీకి సంబంధించిన విరుగుడు చర్యలను తేలిక చేశారు. రేవంత్ ను సవాల్ చేసి హీరో కావాలనుకుని.. కొందరు ఎత్తుగడలు వేశారు. రేవంత్ రాజకీయం ముందు అవన్నీ ఫట్టుమని ఏడుపులు కన్నీళ్ళే మిగిలాయి. అడ్డగోలుగా నోరుపారేసుకుని.. విచారం వ్యక్తం చేయకపోగా, గర్వానికి పోవడంతో కొండా ఫ్యామిలీ పొలిటికల్ కెరీరే అంధకారంలో పడింది. కొండా సురేఖ బర్తరఫ్ జరగదని... చాలా మంది వీరిని ఎగదోసిన నాయకులు ఊహించగా, తన జోలికి వచ్చిన వారికి బుద్ధిచెప్పడంలో ఆయన స్టైలే సెపరేట్ అని మరోసారి చాటారు. కొండా సురేఖను కేబినెట్ నుండి బర్తరఫ్ చేయమే కాదు.. ఒకేసారి మూడు బీసీ సామాజికవర్గాలకు చెందిన ముగ్గురు మహిళలకు పదవులు ఇప్పించి పవర్ ప్యాక్ట్ ప్యాకేజీతో రేవంత్ బీసీ బ్యాలెన్స్ చేశారు. దీంతో ముందు పని కొస్తాయనుకున్న అస్త్రాలు.. తేలిపోయాయి. అదీకాకుండా సొంత నియోజకవర్గంలో సొంత సామాజికకవర్గ మహిళా నేతకు లిఫ్ట్ ఇచ్చారు. దీంతో రేవంత్ రాజకీయానికి నివ్వెర పోవాల్సివచ్చింది. ఏ రాజకీయపార్టీలో ఉన్నా.. ఆ పార్టీల ముఖ్యులతో ఘర్షణలు కామన్ కావడంతో కొండా ఫ్యామిలీని చేర్చుకోవడానికి అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ సిద్ధంగా లేనట్లు కనబడుతోంది. రెండు పదవులు ఇచ్చిన కేసీఆర్ నే నానా మాటలు అని కొండా సురేఖ, మురళి బయటకు రాగా, నాడు



రోశయ్య.. నేడు రేవంత్ ను అదే రకంగా దూషించి ఇరకాటంలో పడ్డారు. ఎవరిని పడితే వారిని చేర్చుకోవడానికి బీజేపీ డస్ట్ బిన్ కాదంటూ ఆ పార్టీ జాతీయ నేత మురళీధర్ రావు నేరుగా ట్విట్టర్ లో పోస్ట్ పెట్టగా, కొండా సురేఖను తమ పార్టీ కార్యాలయ గేటు కూడా తాకనివ్వమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తేల్చిచెప్పారు. దీంతో సొంతపార్టీలోనే.. మౌనంగా ఉండి నియోజకవర్గంలో రాజకీయాన్ని సరిదిద్దుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొండా కుటుంబ చర్యలతో ఇపుడు సొంత క్యాడర్ కూడా నారాజ్ గా ఉన్నారు. మొత్తం ఎపిసోడ్ లో కొండా సురేఖపై సానుభూతి లేకపోగా, ఏళ్ళుగా ఉన్న క్యాడర్ కూడా సమర్థించలేని పరిస్థితి నెలకొంది. అన్ని రకాలుగా లెక్కలు చూసే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో అన్ని రకాల అసమ్మతికి చెక్ పెట్టారు.

కాంగ్రెస్ రాజకీయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్థం చేసుకున్నట్లుగా గత నాలుగైదు దశాబ్దాలుగా పార్టీలోనే అనేక పదవులు అనుభవించిన నేతలు కూడా అర్థం చేసుకోలేదని చెబుతుంటారు. కొండాకు చెక్ పెట్టడంతో పాటు మొత్తం రాజకీయాన్ని తనవైపుకు తిప్పుకుని సీఎం మరింత బలంగా మారారు. తాను రేవంత్ రెడ్డికే సపోర్ట్ చేస్తానని, రేవంత్ రెడ్డి ఎక్కడా తగ్గొద్దని ఇలాగే రాజకీయం చేయాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైపు బహిరంగంగా వ్యాఖ్యానించారు. తాను రేవంత్ శక్తి సామర్థ్యాల గురించి కేసీఆర్ కు కూడా చెప్పానని, రేవంత్ ను కంట్రోల్ చేయకుంటే ఓడిపోతావని చెప్పానని అసద్ బహిరంగసభలో గుర్తుచేశారు. తెలంగాణ పాలిటిక్స్ లో కేసీఆర్ ను ఒక చాణక్యుడిగా, వ్యూహకర్తగా పొలిటికల్ మేనేజ్ మెంట్ లో దిట్టగా చూస్తుంటారు. అప్పట్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ను ఓడించి, చంద్రబాబు లాంటి దిగ్గజ నేతను, గ్రామస్థాయి వనకు బలమైన పునాదులున్న తెలుగుదేశంపార్టీని తెలంగాణలో రాజకీయమే లేకుండా చేసి.. ఏక చత్రాధిపత్యంతో కేసీఆర్ ఎదురులేకుండా పాలించారు. కేసీఆర్ ఉండగా.. ఇంకొకరు అసాధ్యం అనుకున్న రాజకీయ పండితుల అంచనాలను పల్టీ కొట్టించి.. కేసీఆర్ నే బోల్తా కొట్టించి, ఎన్నికలకు ఏడాది ముందు వరకు డిపాజిట్లు కోల్పోయిన పార్టీకి జవసత్వాలు నింపి అధికారంలోకి తీసుకురాగల సమర్థత రేవంత్ రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. అలాంటి రేవంత్ రెడ్డితో పెట్టుకోవాలంటే ఎంతో వ్యూహం ఉండాలి. ఈ టర్మ్ లో రేవంత్ ను చికాకు పరచాలని భావించిన ఎంతోమంది దెబ్బతిన్నారు. తీన్మార్ మల్లన్న, జీవన్ రెడ్డి లాంటి వాళ్ళు అధికారపార్టీకి దూరమై మరో ప్లాట్ ఫాం చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పరిచారు.

**ముఖ్యమంత్రిని చికాకుపెట్టి, పార్టీ గీత దాటితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ హైకమాండ్ ఈ ఉదంతంతో స్పష్టమైన సంకేతాలు పంపింది. మాట జారితే రాజకీయ జీవితం ఎంత ఇబ్బందికరంగా మారుతుందో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమయింది. సురేఖపై తీసుకున్న చర్య ద్వారా పార్టీలో ఎవరికైనా ఒకటే రూల్ అనే సందేశం వెళ్లడమే కాకుండా, పార్టీ అంతా రేవంత్ కంట్రోల్ లోకి ఏకతాటిపైకి వచ్చేసింది. రేవంత్ కు హైకమాండ్ వద్ద ఉన్న పట్టు మరోసారి స్పష్టమైంది. తరచూ సీఎంపై ప్రత్యర్థిమీడియా చేసే ఆరోపణలు, కట్టుకథలన్నీ కట్టగా కాలగర్భంలో కలిసిపోయాయి.**

**ఇక మంత్రిపదవిపై హామీ పొంది మూడేళ్ళుగా ఎదురుచూస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆ సమయం ఆసన్నమైందన్నట్లుగా నకిరేకల్ సభ ద్వారా తేలిపోయింది. తాను సీఎం రేవంత్‌ను ఎన్నడూ పల్లెత్తు మాట అనలేదని ఆయన బహిరంగంగా స్పష్టం చేయడం, నకిరేకల్ సభకు హాజరుకావడం వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతోంది. ఇక నకిరేకల్ సభ ద్వారా సీఎం తన నెక్స్ట్ పొలిటికల్ టార్గెట్ ఏంటో ఫిక్స్ చేశారని తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డికి తగిన ప్రాధాన్యతనిస్తూనే, కేబినెట్లోకి ఆయన ఎంట్రీ దాదాపు కన్ఫర్మ్ అయిందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. రేవంత్ రాజకీయాన్ని తక్కువ అంచనా వేసిన వారు ఎవరైనా సరే ఇప్పుడు బోల్తా పడాల్సిందేనని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. తానెవరి బెదిరింపులకు భయపడనని, కేవలం ప్రేమకే లొంగుతానని సీఎం మరోసారి స్పష్టం చేశారు. సిరిసిల్ల, సిద్దిపేటల్లో దండయాత్రకు వస్తున్నామంటూ ప్రకటించిన సీఎం రేవంత్ కాంగ్రెస్ కార్యకర్తల మద్దతుతో ఆ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎరగేస్తామని ప్రకటించారు. పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్న సీఎం, కొడంగల్ ఓటమికి సరైన సమయంలో రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారు.**

## తెలంగాణలో 'రేవంత్ 2.0' రోడ్‌మ్యాప్ సిద్ధం!

**ఈ పరిణామాలన్నింటినీ బట్టి చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని మరింత పటిష్టం చేసేందుకు రేవంత్ 2.0 రోడ్‌మ్యాప్ పూర్తిగా సిద్ధమైనట్లే కనిపిస్తోంది. స్వపక్షంలో తలెత్తిన చిన్నపాటి అలజడులను సమర్థవంతంగా అణచివేయడంతో పాటు, ప్రత్యర్థులకు రాజకీయంగా గట్టి చెక్ పెట్టడంలో రేవంత్ రెడ్డి మరోసారి తన వ్యూహాత్మక చతురతను చాటుకున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ జరగనుండగా, డిసెంబర్ నాటికి సీఎం 2028 డిసెంబర్ ఎలక్షన్ మోడల్ సెట్ చేయనున్నారు. ఈ తాజా రాజకీయ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి? రేవంత్ దూకుడును తట్టుకోవడం ప్రత్యర్థులకు సాధ్యమవుతుందా? కాలమే సమాధానం చెప్పాలి. ఓ వైపు ఫ్యూచర్ సిటీ దశ మార్చే 70వేల కోట్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవానికి డెడ్ లైన్ ఫిక్స్ చేసేశారు. మరోవైపు సిరిసిల్ల, సిద్దిపేటలను టార్గెట్ చేశారు. దీంతో తెలంగాణ రాజకీయాన్ని ఊహించని మలుపులతో సీఎం డ్రైవ్ చేస్తున్నట్లు కనబడుతోంది.**

# కవ్వంపల్లి వర్సెస్ రసమయి.. హద్దులు దాటిన మాటల యుద్ధం

- **ఉపాధ్యాయ దినోత్సవం వేళ ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు**
- **'బోడి టీచర్'.. 'బిచ్చగాడు' అంటూ పరస్పర ఆరోపణలు**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వ్యాఖ్యలు**
- **'వీళ్లేం రాజకీయ నేతలు?'.. ప్రజల పెదవి విరుపు**





**కరీంనగర్, సెప్టెంబరు 5 (మహా):** మానకొండూరు నియోజకవర్గ రాజకీయాల్లో మాటల యుద్ధం తార స్థాయికి చేరింది. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ఇరువురు నేతలు ఉపయోగించిన పరుష పదజాలం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీయగా.. వారి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని అరుంధతి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'చిన్న ఉద్యోగం.. బోడి టీచర్‌గా పనిచేసిన నీకు ఇన్ని ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎమ్మెల్యే కాకముందు గోసి, గొంగడితో వచ్చావు.. బోడి టీచర్ ఉద్యోగం చేశావు' అంటూ కవ్వంపల్లి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఉపాధ్యాయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉపాధ్యాయ వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**దీటుగా స్పందించిన రసమయి**

కవ్వంపల్లి వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో స్పందించారు. 'ఎప్పుడన్నా జై తెలంగాణ అన్న ముఖమా నీది? చంద్రబాబు చెప్పులు మోసిన చరిత్ర నీది కాదా?' అంటూ విమర్శించారు. తనను గోసి, గొంగడితో వచ్చినవాడిగా కవ్వంపల్లి విమర్శించడాన్ని తప్పుబట్టిన రసమయి.. 'ఆ గోసి, గొంగడే తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది' అన్నారు. ఉపాధ్యాయుడిని 'బోడి టీచర్' అనడం దారుణమని, ఒక ఉపాధ్యాయుడు వేలాది మంది డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను తయారు చేస్తారని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా కవ్వంపల్లిపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. 'నా బొచ్చు కూడా పీకలేవు కవ్వంపల్లి' అంటూ ఘాటుగా స్పందించారు. తాను నిజాయితీపరుడినని, అడ్డమైన పనులు చేసే సంస్కృతి తనది కాదని వ్యాఖ్యానించారు. కవ్వంపల్లిని ఉద్దేశించి 'బిచ్చగాడు', 'బిచ్చం బతుకు' అంటూ రసమయి చేసిన వ్యాఖ్యలు కూడా తీవ్ర చర్చకు దారితీశాయి. ఏ పనికైనా రూ.500, రూ.1,000 అడుక్కునే రకం కవ్వంపల్లిదేనని ఆయన ఆరోపించారు.

## ప్రజల్లో అసహనం.. 'వీళ్లేం రాజకీయ నేతలు?'

ఇద్దరు నేతల మధ్య సాగిన ఈ మాటల యుద్ధంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసుకోవడం సహజమే అయినా.. బహిరంగ వేదికలపై వ్యక్తిగత దూషణలు, పరుష పదజాలం ఉపయోగించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, నిరుద్యోగం, విద్య, వైద్యం వంటి అంశాలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు.. ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయ దినోత్సవం రోజునే ఈ వివాదం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. 'వీళ్లేం రాజకీయ నేతలు.. ప్రజల కోసం మాట్లాడాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలతో కాలం గడుపుతున్నారు' అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. మాటల యుద్ధం ఇంతటితో ముగుస్తుందా.. లేక ఇరువర్గాల నుంచి మరిన్ని విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతాయా అన్నది మానకొండూరు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- **55 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు**
- **ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**
- **జిల్లాలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడి ఆధ్వర్యంలో శనివారం ఆకుతోట కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఉర్సుగుట్ట ఆకుతోట కన్వెన్షన్ హాలో నిర్వహించిన గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమానికి
ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
వర్ధన్నపేట ఎమ్మెల్యే కె .ఆర్ నాగరాజు,
**కుడా చైర్మెన్ గుండు సుధారాణి**
గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్ మేర కార్పొరేషన్ చైర్మెన్ సంగ వెంకట రాజం లతో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్ర పటానికి పూలమాల సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ చొరవతో స్ఫూర్తి కార్యక్రమం ద్వారా 10 వ తరగతి ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మర్చిపోరు***

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ మాట్లాడుతూ 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు జిల్లాలోని 50 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఐదుగురు ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు కలిపి మొత్తం 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో 834 పాఠశాలలు ఉండగా, వాటిలో 1,19,773 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లో చెరగని ముద్ర వేస్తారని అన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను జీవితాంతం గుర్తుంచు కుంటారని పేర్కొన్నారు. తాను మొదటి తరగతిలో చదువుకున్నప్పుడు బోధించిన ఉపాధ్యాయురాలిని ఇప్పటికీ మర్చిపోలేదని గుర్తుచేశారు. తనకు చక్కటి చేతిరాత నేర్పించిన ఉపాధ్యాయుల సేవలను స్మరించుకున్నారు.ఒక వ్యక్తి జీవితాన్ని, కెరీర్ ను మార్చే శక్తి ఉపాధ్యాయుడికి ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, అంకితభావం వల్లే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని పేర్కొంటూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన వారిని అభినందించారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీధరాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కరీమాబాద్, కృష్ణకాలనీ, మట్టెవాడ, నెక్కొండ తదితర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం**

కార్యక్రమం చివరలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన 55 మంది ఉపాధ్యాయులను అతిథులు శాలువా, సర్టిఫికెట్, మెమొంటోలతో ఘనంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. దీంతో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, మేరా కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట రాజం, డీఆర్‌డీవో నాగపద్మజ, డీపీఆర్‌వో ప్రేమలత, జెడ్పీ సీఈవో వసంతకుమారి, ఖిలా వరంగల్ మండల తహశీల్దార్ ఇక్బాల్ ,సి ఏం ఓ శ్రీనివాస్ , వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .







# పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబుపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. 111 జీవో పరిధిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, నిర్మాణాలు పూర్తికాకముందే ఇంటి నంబర్లు కేటాయించారని, ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్లకు సైతం ఇంటి నంబర్లు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శంషాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మండల ఎంపీవో రమేష్ శనివారం చౌదరిగూడ గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిర్మాణాలను పరిశీలించారు. ప్రాథమిక విచారణ అనంతరం వారం రోజుల్లోగా సమగ్ర దర్యాప్తు వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీవో తెలిపారు.



# మొయినాబాద్ మండల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అధ్యక్షుల ఎన్నిక

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలోని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి కొండిగారి మహేందర్ మాదిగ అధ్యక్షతన శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీలోని ఎంఎస్ఎస్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులను ఎనకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ మాదిగలు సామాజిక ఆర్థిక రాజకీయ చైతన్యాన్ని అందిపుచ్చుకొని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం మందకృష్ణ మాదిగ పిలుపునందుకొని ఐక్యంగా ఉద్యమించాలని, దండోరా ఉద్యమాన్ని మాదిగ వాడలకు చేర్చి చదువుకున్న యువతరంతో జాతికి నాయకత్వం వహించేలా తీర్చిదిద్ది సమసమాజ స్థాపన కోసం నిర్మించాలన్నారు. అనంతరం మొయినాబాద్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా రామగాళ్ల కుమార్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షునిగా దర్గుపల్లి రాజు మాదిగ ను ఎన్నుకున్నారు .ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఏడి. ఎంఇఎఫ్ నాయకులు శ్రీనివాస్.చేవెళ్ల ఇన్చార్జి బ్యాతాల శివశంకర్ మాదిగ, ఊరంట ప్రవీణ్ మాదిగ, మల్లేష్ మాదిగ, బోడ భాస్కర్ మాదిగ. సిరిగిరి కృష్ణ మాదిగ. తదితరులు పాల్గొన్నారు.




# గురువులను గౌరవించిన నాడే దేశాభివృద్ధి

- **పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్**
- **మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు**
- **సందడి చేసిన విద్యార్థిని విద్యార్థులు**
- **పాఠశాలంతా పండగ వాతావరణం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని రామవరం సుభాష్ చంద్రబోస్ నగర్ లోని ఉన్న మోడ్రన్ ఇఖ్రా స్కూల్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువుల ఔన్నత్యాన్ని చాటి చెబుతూ తెలుగు హిందీ ఇంగ్లీష్ ఉర్దూ భాషల్లో విద్యార్థుల ప్రసంగాలు నృత్య ప్రదర్శనలతో గురువుల గొప్పదనాన్ని చాటి చెప్పారు. అలాగే తరగతుల వారిగా విద్యార్థులు తమ తమ క్లాస్ టీచర్లకు కానుకలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ నేటి భౌతిక వాద సమాజంలో విద్యను వ్యాపార దృక్పథంతో చూస్తూ గురువులను గౌరవించటం లేదని ఇది సరికాదన్నారు. సంవత్సరాల తరబడి అదే తరగతి గదుల్లో ఉంటూ తమ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే నిస్వార్థ పరులైన టీచర్లను మనమంతా గౌరవించిన నాడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అద్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు శిరీష, సల్మా, నాజీయా, సరస్వతీ, లతీఫా, జేఫీషా, అనితా, విజయలక్ష్మీ, సుహాన, కమల తదితరులు పాల్గొన్నారు.

# బైరిచంద్రశేఖర్ కు ఉత్తమ అవార్డు రావడం అద్భుతమైన గుర్తింపు

- **పెండెం విజయ గెజిటెడ్**
- **హెచ్ఎం దుప్పల్లి**

**వలిగొండ సెప్టెంబర్ 5 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బైరి చంద్రశేఖర్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అదనపు కలెక్టర్ భాస్కరరావు డిఇఓ బిక్షపతి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పెండం విజయ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు ఉపాధ్యాయ బృందం లో మీరు ఉండడం మాకెంతో గర్వకారణం అని మీ బోధన ప్రస్థానంలో ఇలాంటి మరెన్నో మైలురాళ్లను అధిగమించాలని వారు ఆకాంక్షించారు





# అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

- **నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**
- **పదేళ్లు దోచి మళ్లీ రోడ్డెక్కుతున్న కబ్జాకోరులు**
- **బురద రాజకీయాలు చేస్తే తస్మాత్ జాగ్రత్త**
- **దమ్ముంటే అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రండి**
- **బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి హెచ్చరిక**



**అబ్దుల్లాపూర్మెట్ , మహా:** ప్రభుత్వ భూములు, పేదల స్థలాలు...వేటిని వదలకుండా పదేళ్లపాటు దోచుకుతిన్న కబ్జాకోరులు మళ్లీ ఏం ముఖం పెట్టుకుని రోడ్డుక్కుతున్నారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. పేదోడి నోటికాడ ముద్దలాక్కుని తినేవాడికి పేదప్రజల కష్టాలేం తెలుస్తాయన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను ఆయన అందజేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వారు పేదప్రజలకు రేషన్‌కార్డులు, ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంటులాంటి పథకాలను ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజలు మెచ్చి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వమే పేదల గురించి ఆలోచిస్తుందన్న ఆయన...ఎంగిలి మెతుకులకు ఆశపడే వారు తమ పార్టీలో ఉండరని చెప్పారు. పదేళ్ల వారి పాలనలో... రెండున్నరేళ్ల తమ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై దమ్ముంటే చర్చకు రావాలని, తమ కార్యకర్తలే సమాధానం చెబుతారన్నారు.

**ప్రజల దృష్టి మరల్చేలా బురదజల్లే రాజకీయాలు...**

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరల్చేలా బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని.... అలాంటి వారిపై తాను దృష్టి సారిస్తే రోడ్డుపై కూడా తిరగరని చెప్పారు. బట్టకాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే, తోలు తీస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు.

**3అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఎమ్మెల్యే హామీ....**

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంటిస్థలం లేని వారికి కూడా గృహసౌకర్యం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రేషన్‌దుకాణాలే పేద ప్రజల సంక్షేమ పథకాలకు కేంద్రాలన్న మల్‌రెడ్డి... అవసరమైన చోట మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, బాటసింగారం రైతు సహకార బ్యాంకు ఛైర్మన్ జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ భాస్కరాచారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జక్క రవీందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ విజయాశ్రీశైలం, కవాడిపల్లి సర్పంచ్ లక్ష్మీప్రసన్నరవీందర్‌రెడ్డి, జాఫర్‌గూడ సర్పంచ్ వెంకటేశ్‌గూడ, లష్కర్‌గూడ సర్పంచ్ ఐలయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ దాసుగౌడ్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

- **మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి**
- **ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతులను వెలిగించేది ఒక గురువు మాత్రమేనని మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కూలీ లైన్ ప్రైమరీ స్కూల్లో విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను రుక్మాంగాధర్ బండారి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను 1962 సంవత్సరం నుండి నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తరతరాలుగా గురువుని పూజనీయ స్థానంలో ఉంచి తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకు ఇచ్చిన సంస్కృతి మనదని బండారి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు తన జీవితాన్ని శిష్యుల భవిష్యత్తు కోసం అంకితం చేసే మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూలీలైన్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు సాయి చందు, సుభాషిని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# మంత్రి జూపల్లి పర్యటనకు ఏర్పాట్లు

- **పరిశీలించిన కలెక్టర్ భవేష్ మిశ్రా**
- **అధికారులకు పలు ఆదేశాలు**

**నిర్మల్ మహా:** ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించి వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో, పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ శనివారం బాసరలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి నది పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ ఈఈలు అనిల్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, తహసీల్దార్లు పవన్ చంద్ర, శశి భూషణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేడు బాసరకు రానున్న మంత్రి జూపల్లి

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అం డ్ ప్రోహిబిషన్ , పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు.ఉదయం తన నివాసం నుండి రోడ్డు మార్గం ద్వారా పయనించి 1055 వరకు బాసరకు చేరుకుంటారు . గోదావరి పుష్కరాల నేపథ్యంలో 20 కోట్లతో చేపట్టే పుష్కర్ ఘాట్ అభివృద్ధి పనులకు ,354 కోట్లతో చేపట్టే ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపన చేయనున్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాలు అలాగే ఆయిల్ పామ్ సాగు చేయిస్తున్న వ్యవసాయ ఉద్యోగులకు అవార్డులు అందచేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు బాసర నుండి తిరిగి హైదరాబాద్ కు పయనమవుతారు.

# విమానాశ్రయ ఉద్యోగిని రాధిక మృతి

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అప్రోచ్ రోడ్డుపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విమానాశ్రయ ఉద్యోగిని పుల్లామోని రాధిక (33) మృతి చెందారు. బైక్‌పై విధులకు వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రాధిక అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న పృథ్వీరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్జీఐఏ పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా టాక్సీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ఉద్యమకారుల హక్కుల కోసం ఉద్యమకారుల గొంతుకగా పనిచేస్తా

**భువనగిరి సెప్టెంబర్ 5 మహా న్యూస్**

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ఉద్యమకారుల గొంతుకగా పనిచేస్తానని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక వెబ్ సైట్ ప్రారంభిస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమని అన్నారు విధివిధానాలతో వెబ్సైట్ తొందరలో ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు అనేకమంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం పోలీసు కేసులు జైలునిర్బంధాలు ఎదుర్కొని అనేక అవస్థలు పడ్డారని వారిని గుర్తించడానికి వెంటనే వెబ్సైట్ ప్రారంభించాలని క్రిస్టఫర్ అన్నారు ఉద్యమకారులు ఎప్పుడెప్పుడా అని వెబ్సైట్ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వానికి ఉద్యమకారులకు మధ్య వారధిగా పని చేస్తానని ఉద్యమకారుల హక్కులు సాధించేవరకు విశ్రమించేది లేదని అన్నారు



# మరింత మెరుగుగా పారిశుధ్య నిర్వహణ

- **36 లక్షలతో నాలుగు ట్రాక్టర్ల కొనుగోలు**
- **అదనపు కలెక్టర్ తో కలిసి ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్**
- **పట్టణాభివృద్ధే లక్ష్యమని వెల్లడి**

**ఆదిలాబాద్ మహా:** అదిలాబాద్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన వాహనాలను సమకూరుస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ తెలిపారు.15వ ఫైనాన్స్ నిధులతో సుమారు రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు ట్రాక్టర్లను శనివారం అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ మాట్లాడుతూ . గత రెండు నెలల క్రితమే ఒక నూతన జేసీబీ, ఒక బ్లేడ్ ట్రాక్టర్ కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో ఆరు చిన్న ఈ టాటా ఏస్ వాహనాలు అందుబాటులోకి రానున్నాయని, ప్రస్తుతం అవి టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు.అదేవిధంగా మున్సిపాలిటీ అభివృద్ధి పనుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 133 మున్సిపాలిటీలకు కలిపి సుమారు 2 వేల 780 కోట్ల టీయూఎఫ్ఐడీసీ ఏఐడీఎఫ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు.ఇందులో భాగంగా అదిలాబాద్ మున్సిపాలిటీకి కూడా వివిధ అభివృద్ధి పనుల కోసం 18 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని, వాటితో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.అదే విధంగా మరో 43 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధుల పనులు ప్రస్తుతం ఆన్‌లైన్ టెండర్ దశలో ఉన్నాయని, మరో వారం నుంచి పది రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు.రాబోయే రోజుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అదిలాబాద్ మున్సిపాలిటీ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి 154 కోట్ల అభివృద్ధి పనుల కొరకు ప్రతిపాదనలు పంపామని, అందులో నుండి మరో రూ.50 కోట్ల నిధులు రానున్నాయని ఆమె తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అదిలాబాద్ మున్సిపాలిటీలో రాబోయే రోజుల్లో ఎక్కడా అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటామని, 49 వార్డుల్లోనూ సరిసమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడతామని బండారి అనూషా సతీష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్ ,శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్ , టిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎనగంటి ప్రకాష్ , కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రాబోయేది కారు.. సారు.. సర్కారు..

**నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తిక్ రెడ్డి...**

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాకీ కార్డులతో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా బుద్వేల్ లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్లే కార్డులు బాకీ కార్డులతో నిరసనలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అయిన ఆరోపించారు. విదేశాల్లో విద్య అభ్యసిస్తున్నా విద్యార్థులకు ప్రభుత్వం సకాలంలో ఆర్థిక సాయం అందించకపోవడంతో వారు వాణిజ్య సముదాయాల్లో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకం

- **విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో గురువులదే కీలక పాత్ర**
- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**




**మణుగూరు, మహా :** విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ, భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మంచి నడవడికను పెంపొందించడంలో గురువులు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గురువుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక స్పృహ, మానవతా విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాల కల్పనకు తనవంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ కార్యక్రమాలతో ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటారు. ఉపాధ్యాయులను సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, ఎంఈఓ స్వర్ణ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## గురువులే విద్యార్థుల విజయానికి మార్గదర్శకులు..

- **కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు**
- **విద్యార్థి పర్సనల్ మోటివేటర్ డాక్టర్ ఓ శ్యామ్ ప్రసాద్**

**మణుగూరు, మహా :** విద్యార్థుల విజయానికి గురువులే నిజమైన మార్గదర్శకులని, వారి బోధన, ప్రోత్సాహం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని విద్యార్థి పర్సనల్ మోటివేటర్ డాక్టర్ ఓ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మణుగూరు ఏరియాలోని సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం-2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. గురువులను గౌరవిస్తూ వారు బోధించిన విలువలను జీవితంలో ఆచరించాలని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డికె కళ్యాణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతోపాటు మంచి సంస్కారం, నైతిక విలువలు అలవర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, పాటలు, నృత్యం తదితర రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 10/10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి చిన్న తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. తద్వారా ఉపాధ్యాయుల బాధ్యతలు, గురువుల పాత్ర ప్రాధాన్యతను స్వయంగా తెలుసుకున్నారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రధానోపాధ్యాయురాలు డికె కళ్యాణి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం

- **సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘన సన్మానం.**

**భువనగిరి సెప్టెంబర్ 5 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారండాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని వలిగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుప్పల్లి పాఠశాల లో పనిచేస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బైరు చంద్రశేఖర్ కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అదనపు కలెక్టర్ భాస్కరరావు జిల్లా డీఈవో బిక్షపతి గారల చేతుల మీదుగా శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా శాలువా, మెమెంటో తో సత్కరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ,అదనపు కలెక్టర్ భాస్కరరావు ,జిల్లా డిఈఓ బిక్షపతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని ఉపాధ్యాయ వృత్తిని గౌరవించాలని వారు కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులు బైరు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకంలో ఉండే పాఠాలే కాదు వారి నిత్యజీవితంలో ఉండే గుణపాఠాలను కూడా నేర్చుకోవాలంటే తప్పకుండ గురువు దగ్గరికి చేరాలని అన్నారు.ఏ వృత్తికి లేని ఇతివృత్తం కేవలం ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైన గురువు స్థానము లభించడం గొప్ప గర్వకారణం అని కొనియాడారు .ఏ వ్యక్తికి లేని శిష్యకోటి పరివృత్తం కేవలం ఉపాధ్యాయునికే సొంతమని తెలిపారు. ఈ లోకంలో తల్లి, తండ్రి,కొడుకుల సంబంధం వలె గురువు శిష్యుల సంబంధం కూడా స్థిరమైనది అతి పవిత్రమైనదని పేర్కొన్నారు.గురువు శిష్యునికి విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా అతడు గురువును మించిన శిష్యుడుగా అభివృద్ధి చెందాలని కోరుకుంటాడు.తన శిష్యులు ఆకాశమే హద్దుగా ఎదగాలని ప్రతి శిష్యుని యొక్క శ్రేయస్సును ఎల్లప్పుడూ కోరుకుంటాడని తెలిపారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులు కూడా జీవితంలో స్థిరపడి ఉన్నత స్థానాన్ని సంపాదించాలని సూచించారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పూర్తి సందర్భంగా భారీ ర్యాలీ

- **అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా, ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**పెద్దపల్లి మహా, పెద్దపల్లి:** ప్రజా ప్రభుత్వం-కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చీకురాయి రోడ్డు నుండి జెండా చౌరస్తా వరకు ఘనంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ర్యాలీ ర్వహించినట్లు నాయకులు తెలిపారు.ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ర్యాలీ సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ విజయవంతంగా కొనసాగింది.



## నవ సమాజ రూపశిల్పులు ఉపాధ్యాయులే..

- **వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్**
- **బండారుగూడెం పాఠశాల ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**మణుగూరు, మహా :** నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మణుగూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని బండారుగూడెం యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. విద్యార్థుల్లో విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించి సమాజానికి మంచి పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సావిత్రితో పాటు ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ముఖ్యులు బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథ గుప్తా, చిత్తలూరి రమేష్‌బాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, సముద్రాల కిషోర్, సుగ్గల సూర్యం, కొల్లూరి గౌరీశంకర్ పాల్గొన్నారు.




## ఆరోగ్యానికి క్రీడలు అవసరం

- **జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్**
- **ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం**

భద్రాద్రి కొత్తగూడెం,మహా: **క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్** కుమార్ అన్నారు. కార్పొరేట్ ఏరియా డబల్యూపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ నందు డిపార్ట్మెంటల్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిఎం వెల్ఫేర్ అజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సంస్థ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని సూచించారు. క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడా పోటీల కొరకు సింగరేణి సంస్థ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అందరూ తమ ఫిట్‌నెస్ ను కాపాడుకుంటూ నిరంతరం సాధన చేస్తూ పతకాలు సాధించాలనే దృఢ సంకల్పంతో కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి ఆటగా బాస్కెట్ బాల్ మ్యాచ్ ను హెడ్డాఫీస్ వర్సెస్ ఎస్ అండ్ పిసి డిపార్ట్ మెంట్ గ్రూప్ మధ్య నిర్వహించగా హెడ్ ఆఫీస్ జట్టు విజయం సాధించింది.ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ బి.శివ కేశవరావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. పితాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ కె.కమలాకర్, డివైపిఎం వి.అనీల్ కుమార్, డివైపిఎం అండ్ హానరీ సెక్రెటరీ కే.సునీల్ కుమార్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి.పోస్ నెట్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సిహెచ్. రమేష్, బాస్కెట్ బాల్ కెప్టెన్ అరుణ్, బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



## సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు..

**పెద్దపల్లి, మహా, :** పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాజీ భారత రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత, మహనీయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి 138వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి దేశానికి చేసిన సేవలను, విద్యారంగానికి అందించిన విశిష్ట కృషిని స్మరించుకున్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



## పెద్దిపల్లిలో వైద్య శిబిరం..

- **ఇంటింటా జ్వర సర్వే.. వైద్య పరీక్షలు..**
- **పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన**

**మణుగూరు, మహా :** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన పెద్దిపల్లిలో శనివారం వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గృహ సందర్శన చేయడంతోపాటు జ్వర సర్వే నిర్వహించి గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలుషిత నీరు, దోమల కారణంగా జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వలస ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారు జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆశా కార్యకర్త ద్వారా రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. దోమల నుంచి రక్షణకు దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని అవగాహన కల్పించారు. ఆరోగ్య శిబిరం అనంతరం అర్హులైన వారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, కృష్ణ, శైలజ, రోజా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవం

**ఆదిలాబాద్ మహా:** ఉపాధ్యాయులు స్వీయ ప్రేరణతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఉట్నూరు మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినగురుపూజోత్సవవేడుకల్లోఆయనఐటీడీఏ పీవో మందమకరందుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల విద్యార్థులు మాతృభాష నుంచి ప్రధాన ధారలోకి వచ్చి, మెరుగైన విద్యా ప్రమాణాలు సాధించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషితో పాటు స్వీయ ప్రేరణ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్న 133 ఆశ్రమ పాఠశాలలు, 900 పైచిలుకు ప్రాథమిక పాఠశాలలు, గురుకులాలు, ఈఎంఆర్ఎస్ లలో తొలిసారిగా ఎఫ్ఎల్ఎన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు తమ ఉత్తమ బోధనా పద్ధతులను తోటివారితో పంచుకుంటూ, విద్యార్థులలో డ్రాపౌట్లు లేకుండా ఉన్నత చదువులు, కెరీర్ గైడెన్స్ అందించాలని సూచించారు.అనంతరం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు కలెక్టర్ రాజర్షిషా, పీవో, సబ్ కలెక్టర్ ప్రణయ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలతో సత్కరించి మొమెంటోలు బహూకరించారు.ఈ కార్యక్రమంలో డీడీ అశోక్, ఏపీవో భాస్కర్, డిప్యూటీ డిఈఓ చందన్, గిరిజన క్రీడా అధికారి పార్థసారథి, ఉమ్మడి జిల్లా డీటీడీవోలు, వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 రద్దు చేయాలి

- టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

**బెల్లంపల్లి, మహా**: పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకు రావడాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నారు .ఈ నేపథ్యంలో శనివారం నాడు బిఆర్ఎస్ పార్టీతో పాటు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణం లోని తిలక్ గ్రౌండ్ నుండి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ,జీవో నెంబర్ 97 అమలుతో పాలిటెక్నిక్ విద్య కున్న గుర్తింపు పై అనిశ్చితి ఏర్పడుతుందని, పాలిటెక్నిక్ విద్య అనంతరం ఈసెట్ ద్వారా బీటెక్ లోకి లిటరల్ ఎంట్రీ, ఉన్నత విద్య తో పాటు ఉపాధి అవకాశాలపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య విశ్వవిద్యాలయాల పరిధిలోకి తీసుకురావడంతో విద్యార్థులపై భవిష్యత్తులో ఫీజులు ఫీజు రియంబర్స్మెంట్ లు స్కాలర్షిప్లు తదితర ఆర్థిక పరమైనటువంటి అంశాలలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోని ఎస్బి టి ఈ టి లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బీ ఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ తోపాటు పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, నాయకులు గోలి శివ,సబ్బని అరుణ్,బిఆర్ఎస్ పార్టీ కి చెందిన పట్టణ వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ అసమర్థ పాలనపై బిఆర్ఎస్ పోరు

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి, మహా**: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనపై టిఆర్ఎస్ పోరు కొనసాగిస్తుందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రభుత్వ హామీల విఫలంపై బ్యానర్ తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల వంచక దగా పాలన, 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలపై పోరుబాట కార్యక్రమం లో భాగంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 5వ రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఫీస్ రీయింబర్స్మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ మోసాలపై నిరసనగా నియోజకవర్గ విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. రేవంత్ ప్రభుత్వం 33 నెలల పాలనలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు, నిరుద్యోగులకు, యువతకు బాకీ పడిన ఫీ రీయింబర్స్మెంట్ 12,000 కోట్ల రూపాయలు, 2 లక్షల ఉద్యోగాలు, ప్రతీ నిరుద్యోగికి 1,32,000 రూపాయల నిరుద్యోగ భృతి, 5 లక్షల రూపాయల విద్యాభరోసా కార్డు, రాజీవ్ యువ వికాసం, తదితర హామీలను తక్షణమే అమలుచేయాలని, విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ మునిసిపల్ చైర్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ,బిఆర్ఎస్వీ పట్టణ బిఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ తదితర నాయకులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టు

- సిగరెట్ షాప్ లో చోరీ
- 5లక్షల 35వేల విలువైన సిగ రెట్ బాక్సులు మాయం
- 5 గురి అరెస్ట్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో సిగరెట్ షాప్‌లో చోరీకి పాల్పడిన రాజస్థాన్‌కు చెందిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగలతో పాటు కొనుగోలు చేసే మరో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితులు ముందుగా షాప్ వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో గడ్డపారతో షాప్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి వివిధ రకాల సిగరెట్ బాక్సులతో పాటు కౌంటర్‌లోని నగదును చోరీ చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన సిగరెట్లను పఠాన్‌చెరులో తమకు పరిచయమైన వ్యక్తికి విక్రయించేందుకు ప్రయత్నించారు. సిగరెట్ల మొత్తం విలువ సుమారు రూ.5.35 లక్షలు ఉన్నట్లు నిందితులు వెల్లడించారు. కొంత మొత్తానికి సిగరెట్ బాక్సులను విక్రయించి, వచ్చిన నగదును నలుగురు పంచుకున్నట్లు విచారణలో తెలిపారు. మిగిలిన సిగరెట్ బాక్సులను విక్రయించేందుకు, అలాగే ఆదిలాబాద్‌లో మరో చోరీకి పాల్పడే ఉద్దేశంతో నిందితులు తిరిగి ఆదిలాబాద్‌కు వచ్చారు. సిగరెట్ బాక్సులను విక్రయిస్తున్న సమయంలో పోలీసులు వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించగా, నిందితులు అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా సిగరెట్ షాప్‌లో చోరీ చేసినట్లు అంగీకరించారని ఎస్పీ తెలిపారు. నిందితులు రాజస్థాన్ కు చెందిన కుమావత్ బుందారం , కుమావత్ ఘనశ్యామ్ ,కుమావత్ మాణిక్ చంద్ ,కుమావత్ లక్ష్మణ్ ,పఠాన్ చెరువు కు చెందిన తేజ్పాల్ సింగ్ అరెస్ట్ చేసి 60వేల నగదుతో పాటు చోరీ విలువలో దాదాపు 80శాతం విలువ చేసే వివిధ సిగరెట్ బ్రాండ్ల 102 సెట్స్ , ఒక కారు ,4 సెల్ ఫోన్ లు, ఒక గడ్డపార, హ్యాండిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విచారణలో నిందితులు గతంలో మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్, హైదరాబాద్ హైవే పక్కన ఉన్న పాన్ డబ్బాను పగులగొట్టి నగదు చోరీ చేసినట్లు కూడా వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి అంతర్రాష్ట్ర పరిధిలో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు..గతంలో నిందితులపై ఏడు అంతర్రాష్ట్ర కేసులు ఉన్నట్లు తెలిపారు. దాదాపు దొంగలించిన సొత్తులో 80% రికవరీ జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కు దీటుగా సర్కార్ దవాఖాన.!

- ఇబ్రహీంపట్నంలో నూతన 100 పడకల దవాఖాన
- నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రంగారెడ్డి
- సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- ఆగమ్యగోచరంగా మారిన రోగుల పరిస్థితి...
- డిప్యూటేషన్ పై వెళ్లిన వైద్యులను రప్పించిన ఎమ్మెల్యే..
- ప్రస్తుతం ప్రతిరోజు 500 వరకు రోగులతో ఓపి.!
- వెల్లడించిన సర్కార్ దవఖాన వైద్యులు



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 5 మహా:** ఇబ్రహీంపట్నం కేంద్రంలో నూతనంగా నిర్మాణం అవుతున్న 100 పడకల సర్కార్ దవఖాన పనులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆకస్మిత తనకి నిర్వహించారు. దవఖాన పనులు ఆలస్యం కావడంతో అధికారులపై, కాంట్రాక్టర్ల పై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కేంద్రంలో నూతనంగా చేపడుతున్న 100 పడకల సర్కార్ దవఖాన పనులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. దవఖాన పనులను పరిశీలించిన ఆయన వీలైనంత తొందరలో దవఖాన నిర్మాణం చేసి పేద ప్రజలకు అందించాలన్నదే తన బాధ్యత అని అన్నారు. దవఖాన పనుల అలసత్వం పై అధికారులపై, కాంట్రాక్టర్ పై అసహనం వ్యక్తం చేశారు. జనవరి నాటికి నిర్మాణ పనులను పూర్తి చేసి పేద ప్రజలకి అందించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు.

**ప్రైవేట్ కు దీటుగా సర్కార్ దవఖాన...**

ప్రైవేట్ కు దీటుగా సర్కార్ దవాఖానను నిర్మిస్తానని ఎన్నికల సమయంలో మాట ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారమే ప్రజలకు అన్ని వసతులతో కూడిన 100 పడకల దవఖాన నిర్మాణం చేస్తున్నామని అన్నారు. దవఖాన నిర్మాణం కోసం 50 కోట్లు కేటాయించామని అవసరం అయితే మరో 50 కోట్లు కేటాయిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో కనీస వసతులు లేని భవనం ఉండడంతో, అమాయక ఆడబిడ్డలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి మహిళలు కుటుంబ నియంత్రణ కోసం ఇబ్రహీంపట్నం సర్కారు దవాఖానకు రావడంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా, కూని ఆపరేషన్ వికటించి ఆడబిడ్డలు ప్రాణాలు కోల్పోయారని, ఆ తల్లుల పిల్లలు అనాధలు అయ్యారని అన్నారు. ఆరోజు తీసుకున్న నిర్ణయం ప్రకారమే, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డలను బలి తీసుకున్న, ఆ భవనాన్ని నెల మట్టం చేసి, అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తామని ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, పాత భవనాన్ని పడగొట్టి, నూతన భవనానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**ఆగమ్యగోచరంగా మారిన రోగుల పరిస్థితి... డిప్యూటేషన్ పై వెళ్లిన వైద్యులను రప్పించిన ఎమ్మెల్యే..**

శిధిలా వ్యవస్థలో ఉన్న దవాఖాన పరిస్థితి వల్ల, పేద ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు ఈ యొక్క భవనంలో కనీస వసతులు లేవు, సౌకర్యాలు లేవు అంటూ, విధులు నిర్వహించలేమని వేరొక చోటకి డిప్యూటేషన్ పై వెళ్లిపోవడంతో, దవాఖానాలో రోగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. దాదాపు 35 మంది వైద్యులు ఉండాల్సిన దవాఖానలో ముగ్గురు నలుగురు వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా రోగులు దవాఖాన వైపు రావడమే మానేశారని అన్నారు. దీంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని, డిప్యూటేషన్ పై వెళ్లిన వైద్యుల గురించి సంబంధిత మంత్రితో చర్చించి వారందరినీ తిరిగి ఇబ్రహీంపట్నం సర్కార్ దవాఖానకు రప్పించడం జరిగింది. ప్రస్తుతం ప్రతిరోజు 500 వరకు రోగులు రావడంతో, ఓపి వైద్యం కొనసాగుతుందని తెలిపారు. త్వరలో 100 పడకల దవఖాన భవనం పూర్తిచేసి, అన్ని రోగాలకు ఒకే చోట వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్లు కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, చిలక మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మండల పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం, మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆకుల యాదగిరి, నీళ్ల భాను గౌడ్, దారు రాఘవేందర్, ఇందూరి శ్రీనివాస్, వర్త్య రాందాస్, ఏఎంసి డైరెక్టర్ తాళ్ల మహేష్ గౌడ్, నేతలు భూపతిగళ్ళ మహిపాల్, ముత్యాల రాజశేఖర్ రావు, తాళ్ల శ్రీశైలం గౌడ్, రాచర్ల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి చిన్న, పిట్టల యాదగిరి, పలు గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, సిఐ మహేందర్ రెడ్డి, పలు శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రీ సర్వే తో రైతుల భూ సమస్యలకు పరిష్కారం

**వరంగల్ ఆర్డీవో సుమ**

**వరంగల్, రాయపర్తి మహా :** రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్ తో కలిసి వరంగల్ ఆర్డీవో సుమ పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే ప్రక్రియ, దాని ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూ సరిహద్దులు, భూ విస్తీర్ణం తదితర అంశాల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. రీ సర్వే కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే సమయంలో అవసరమైన భూ పత్రాలు అందుబాటులో ఉంచుకుని, తమ భూముల వివరాలను సక్రమంగా తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి

**మొయినాబాద్ మహా**: అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని వారిని మోసం చేసిందని.. నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదని నిరసిస్తూ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి వారి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. నిరుద్యోగులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నరసింహా రెడ్డి, ముదిగొండ రవి యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, కొంతం నాగేశ్వర్ రెడ్డి, డప్పు రాజు, చిడిగిద్ద కృష్ణారెడ్డి, షాబాద్ శ్యామ్ రావ్, పాటి ప్రసాద్ రెడ్డి, విష్ణు గౌడ్, అరవింద్ రజక తదితరులు ఉన్నారు.



# ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

- అధ్యాపకులను సత్కరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్
- తమ తమ గురువులను స్మరించుకున్న బోధనా బృందం

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మొదటి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా, దేశానికి గొప్ప ఉపాధ్యాయులుగా ఆయన అందించిన సేవలను వక్తలు కొనియాడారు....అధ్యాపకులకు ఘన సన్మానం...ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన, సాంస్కృతిక విభాగం మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపకులకు ఘనంగా సత్కారం జరిగింది. ఒక్కో బోధన సిబ్బందిని శాలువా మరియు మెమెంటోతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.ఈసందర్భంగా ఉపాధ్యాయుల ప్రసంగాలు, పాటలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపర్డెంట్ పుప్పాల శ్రీనివాస్ ,బోధ నేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




# బహుదూర్ గూడ రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి

**తోకల శ్రీనివాసరెడ్డి...**

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద 22ఏ నిషేధిత భూముల జాబితాకు వ్యతిరేకంగా రెండు రోజుల మహా దీక్ష నిరసన కార్యక్రమం బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈదీక్షలో తెలంగాణ బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.భూ భారతి (ధరణి) పోర్టల్‌లో లోపాల వల్ల పేదలు, మధ్యతరగతి, రైతుల పట్టా భూములను నిరంకుశంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి భూ బాధితులు తో కలిసి పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రైవేట్, రైతుల పట్టా భూములను తక్షణమే 22ఏ నిషేధిత జాబితా నుండి తొలగించి, బాధితులకు ఆస్తి హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించకుంటే రాబోయే రోజుల్లో అసెంబ్లీని ముట్టడిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.శంషాబాద్ లోని బహదూర్ గూడ,ఘన్సిమీయాగూడ, భూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల బీజేపీ ఇన్చార్జులు, నాయకులు, భూబాధితులు, రైతులు పాల్గొన్నారు.



# విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రనే కీలకం: మల్‌రెడ్డి..

- ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు
- సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని వెల్లడి...
- ఉపాధ్యాయులను గౌరవించడం మన సంప్రదాయం
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే అభినందనలు...

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 5 మహా**: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గురువులు అందిస్తున్న సేవలను కొనియాడారు. జ్ఞానాన్ని అందిస్తూ, విద్యార్థులకు మంచి విలువలు నేర్పుతూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 5 గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని, శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి అవార్డులు ప్రధానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

# మాజీ కుడా చైర్ పర్సన్‌కు అవమానం

- వీడ్కోలు కు నోచుకోని ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి
- హుటాహుటిన నూతన చైర్‌పర్సన్ చేత ప్రమాణ స్వీకారం
- ప్రమాణ స్వీకారానికి దూరంగా మాజీ కుడా చైర్మన్
- పాత టీడీపీ నేతలంతా ఒక్కటయ్యారని జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ
- ఏళ్లుగా పార్టీని పట్టుకుని ఉంటున్న నేతలకు అవమానాలేనా?
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముదురుతున్న అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్ రాజకీయ వివాదం





**వరంగల్,బ్యూరో మహా :** ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్లో ముదిరిన అంశం అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్ అని కొంతమంది నేతల ప్రచారానికి అనుగుణంగానే కీలక నేతల చర్యలు కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల హవా అధిష్ఠానంలోని కీలక నేతల మద్దతు కూడా వారికేనంటూ పాత క్యాడర్ మండిపడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' రాజకీయ వివాదం మరింతగా ముదురుతోంది. ఇటీవల కుడా చైర్మన్ గా ఇనుగాల వెంకట్రాం రెడ్డి పదవీకాలం ముగిసిన వెంటనే ఎవరూ ఊహించని విధంగా ఎవరికి పూర్తి సమాచారం ఇవ్వలేదనే ఆరోపణల మధ్య మాజీ మేయర్ గుండు సుధారాణిని కుడా కు కొత్త చైర్ పర్సన్ గా నియమించడం హుటాహుటిన ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించడం ఇప్పుడు జిల్లా కాంగ్రెస్ లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా మాజీ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి కి కనీసం వీడ్కోలు కార్యక్రమం కూడా నిర్వహించక పోవడం పై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా కొత్త చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి వెంకట్రాం రెడ్డి దూరంగా ఉండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పదవి మార్పు సాధారణ ప్రక్రియే అయినా.. అందుకు అనుసరించిన తీరు మాత్రం పార్టీ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపింది.

**పాత క్యాడర్ కు ప్రాధాన్యం ఎక్కడ?**

అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ ను నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేసిన నేతలకు పదవులు, గుర్తింపు విషయంలో నిరాశే మిగులుతోందన్న అసంతృప్తి ఇప్పటికే పార్టీ శ్రేణుల్లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలకు మాత్రం వరుసగా కీలక అవకాశాలు దక్కుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుడా చైర్మన్ పదవి విషయంలోనూ ఇదే అంశం తెర పైకి రావడంతో పాత కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు బలపడితే దాని ప్రభావం భవిష్యత్ రాజకీయాల పై పడే అవకాశం ఉందని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది.జిల్లాలో పార్టీ రెండు వర్గాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ రెండు వర్గాలుగా ఉన్నట్లుగా ఉందని కొందరు నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో టీడీపీలో పనిచేసిన పలువురు నేతలు ప్రస్తుతం కాంగ్రెస్ లో ఒకే వర్గంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ తాజాగా ఊపందుకుంది. వీరికి అధిష్ఠానం లోని పలువురు కీలక నేతల మద్దతు ఉందని, అందుకే పార్టీ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల విషయంలో వారి మాటకు ప్రాధాన్యం లభిస్తోందన్న ఆరోపణలు కాంగ్రెస్ లోని మరో వర్గం నుంచి వినిపిస్తున్నాయి. పదవుల పంపకంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఈ కోణంలోనే కొందరు నేతలు విశ్లేషిస్తున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల హవా పెరుగుతోందన్న ప్రచారం, మొదటి నుంచి కాంగ్రెస్ లో ఉన్న నేతలకు ప్రాధాన్యం తగ్గుతోందన్న అసంతృప్తి కలిసి పోవడంతో 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' వివాదం ముదురుతున్నట్లు తెలుస్తోంది. కుడా చైర్మన్ మార్పు సమయంలో కనిపించిన రాజకీయ సమీకరణాలు, మాజీ చైర్మన్ కార్యక్రమానికి దూరంగా ఉండటం వంటి పరిణామాలు ఈ చర్చకు మరింత బలం చేకూర్చాయి. ప్రచారానికి అనుగుణంగానే కీలక నేతల వ్యవహార శైలి కూడా కనిపించడంతో కొందరు కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నట్లు సమాచారం. పార్టీని పటిష్ఠం చేయాల్సినసమయంలో అంతర్గత విభేదాలు బహిరంగ చర్చకు రావడం నష్టమేనన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ లో పాత, కొత్త నేతల మధ్య ఉన్న అంతరాన్ని మరింత పెంచుతాయా? అన్నది ప్రస్తుత రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన అంశంగా మారింది.

# సర్కారుకు సెగ పుట్టించిన... గులాబీ శ్రేణులు

- వంట వార్పుతో.. దండు కట్టారు దడ పుట్టించారు
- జాబ్ క్యాలెండర్ అంటూ ఊదరగొట్టి... విద్యార్థులను నిండా ముంచారు
- మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి మహేందర్ రెడ్డి, మాజీ మేయర్ కావ్య.



జవహర్ నగర్, మహా: తెలంగాణ ప్రజల బతుకులు ఆగమైపోయతాయని... ఉద్యమం చేసి మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను సాధిస్తే కాంగ్రెస్ పాలనలో ఆకలి కేకల రాజ్యమేలుతున్నాయని పనులు దొరకపోవడంతో ప్రజలు దిక్కుతోచని దుస్థితిలో ఉన్నారని ఉద్యమ సమయంలోనే చేసిన వంటావార్పు మళ్ళీ చేయాల్సిన పరిస్థితి దాపురించిందని మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి చామకూర మహేందర్రెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య దుయ్యబట్టారు.బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ వైఫల్యాలపై చేపట్టిన వారం రోజులు నిరసన కార్యక్రమాల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేందర్రెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ మహిళలకు ఇస్తామన్న హామీలను ప్రభుత్వం మర్చిపోయిందని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై కోర్టుల సాకుతో కాలం వెలుబుచ్చడం దారుణం అన్నారు. ఉద్యమ రోజులు గుర్తుకు వస్తున్నాయని ప్రజా పాలనలో ప్రజలవరు సంతోషంగా లేరని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ఉద్యోగ కార్మిక సమస్యలు సహా ప్రతి రంగాన్ని కాంగ్రెస్ గాలికి వదిలేసిందన్నారు. ఉపాధి లేక యువత పెడదారణ పడుతుందని విద్యార్థులకు స్కాలర్షిప్లు విడుదల చేయలేకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కమిషన్ల పై ఉన్న ఆసక్తి ప్రజాసేవపై లేదని ఎద్దేవ చేశారు. హామీలు నెరవేర్చే దాంక విశ్రమించేది లేదని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. జవహర్ నగర్ బి ఆర్ ఎస్ హయాంలోనే ప్రగతి చెందిందని కాంగ్రెస్ నాయకులు అదే రోడ్డు మీద నిలబడి గొప్పలు పలకడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు అవుతుందన్నారు. జవహర్ నగర్ నా గుండెకాయ అంటూ మల్లారెడ్డి జూబ్లీహిల్స్ తరహాలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పాటలతో బిఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. వంటావార్పుతో నిరసన తెలుపుతూ 900 మంది పేద ప్రజలకు బిఆర్ఎస్ నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్, శ్రీ వాణి, రవి, సతీష్, నాయకులు, వెంకటేష్ ప్రసాద్ గౌడ్, బాలరాజ్ పటేల్, పంతంగి సిద్ధులు యాదవ్, శ్రీరాములు, దిలీప్ అహ్మద్ పాషా, సాయి ,అశోక్, మహేష్, సోమయ్య, రాజేష్, విలాసాగర్ రవి, లక్ష్మణ్, ప్రశాంత్, కేతమ్మ, మంజుల, లక్ష్మి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉన్నత చదువుల అభ్యసనకు సార్వత్రిక విద్య సువర్ణ అవకాశం

- సిఆర్పిఎఫ్ క్యాంపస్ లో దూర విద్యా కేంద్రం ఏర్పాటు.
- సిఆర్పిఎఫ్ డిఐజిపి డాక్టర్ వీర్రాజు.

**జవహర్ నగర్, మహా:** ఉన్నత చదువుల అభ్యసనకు దూర విద్యా(సార్వత్రిక) కేంద్రం బిఆర్ఏఓయు ద్వారా సిఆర్పిఎఫ్ క్యాంపస్ చక్కని సువర్ణ అవకాశం కల్పిస్తుందని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సిఆర్పిఎఫ్ డిఐజిపి డాక్టర్ వీర్రాజు అన్నారు. చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్ లోని సిఆర్పిఎఫ్ క్యాంపస్లో శనివారం సిఆర్పిఎఫ్ డిఐజిపి డాక్టర్ వీర్రాజు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్యను అందించాలని ఉద్దేశంతో సిఆర్పిఎఫ్ క్యాంపస్లో దూర విద్యా కేంద్రం ఏర్పాటు చేశామని చదువుతూ మధ్యలో ఆపివేసిన వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దూర విద్యతో బంగారు భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని అన్నారు. ఆన్లైన్లో కూడా తరగతులు వినవచ్చునని పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక రాయతీయ కల్పించామని తక్కువ ఫీజులోని డిగ్రీ అర్హతలు పొందవచ్చునని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల తొమ్మిదవ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని లేకుంటే అపరాధ రుసుముతో చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సిఆర్పిఎఫ్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు చదువుకోవచ్చునని విద్యతో మీ వృత్తిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. మరింత సమాచారం కోసం సిఆర్పిఎఫ్ వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్ ఫోన్ నెంబర్ 9559034477 నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, సిఆర్పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# రెడ్ల నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

**కుషాయిగూడ, మహా :** రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు కుషాయిగూడ రెడ్డి సంఘం సభ్యులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కుషాయిగూడలో సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగిళ్ల బాల్‌రెడ్డి, కార్యదర్శి మొగిలి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు బీవీ నర్సింహారెడ్డి, సలహాదారు బోలంపల్లి రాంచందర్‌రెడ్డి, జేఏసీ నాయకులు పైళ్ల హరినాథ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి పాల్గొన్నారు. సంఘం సభ్యులు రణధీర్‌రెడ్డి, యాదిరెడ్డి, గంగిరెడ్డి, కేసిరెడ్డి, జీవన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాటేపల్లి శివరెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అనుముల వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం అభివృద్ధి

- మార సురేష్
- ఫామ్ హౌస్ కే పరిమితమైన పదేళ్ల పాలన.!
- 1000రోజుల ప్రజాపాలనను తేడా గమనిస్తున్నారు
- బిఆర్ఎస్ పాలనలో హామీలు గాలికొదిలిన మంచిరెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5, మహా:** పదేళ్ల బీఆర్ఎస్ ఫార్మ్‌హౌస్ పాలనకు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల ప్రజాపాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్ అన్నారు. శనివారం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు అందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని పేర్కొన్నారు. పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చామని చెప్పారు. 1000 రోజుల్లో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని మార సురేష్ వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండీ ఇమ్రాన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహాగౌడ్, బుట్టి కృష్ణ, ఆర్ల మల్లేష్, ఆమంచ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- వరంగల్ సీపీ ఎన్ శ్వేత, ఐపిఎస్
- జిల్లాలో ఘనంగా సంఘమిత్ర కార్యక్రమం ప్రారంభం



**వరంగల్, బ్యూరో మహా ;** సంఘమిత్ర కార్యక్రమం లో భాగంగా మొదటగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాల పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వయం సహాయ గ్రూపులకు చెందిన మహిళా సంఘాలలు గ్రామ దీపికలు, మెప్మా భాగస్వామ్యంతో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పోలీసు శాఖ తో పాటు ప్రజల భాగస్వామ్యం తో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.

వరంగల్ లో"సంఘమిత్ర" కార్యక్రమం ద్వారా డ్రగ్స్ అంశం పై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ తెలిపారు. ఎస్ హెచ్ జి, వి ఓ ఏ సంఘాల్లోని ప్రతి సభ్యురాలు ఈ కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతి అంశంపై అవగాహన సందేశాన్ని ప్రతి ఇంటికి, ప్రతి గడపకు తీసుకెళ్లాలని అలాగే పోలీసులు -ప్రజల భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, వరంగల్ జిల్లాను మరింత సురక్షితమైన జిల్లాగా తీర్చిదిద్దడంలో సంఘమిత్ర ఒక బలమైన వారధిగా నిలవాలని కోరారు. ఎస్హెచ్ జి వాలంటీర్స్, మెప్మా సభ్యుల ద్వారా 1.17 లక్షల మంది సభ్యులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువత, మహిళలు మరియు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు "సంఘమిత్ర" కార్యక్రమాన్ని శనివారం హన్మకొండ లోని కాళోజి కళా క్షేత్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్హెచ్జీ గ్రూపులు 1,000 మెప్మా సభ్యుల ద్వారా 1.17 లక్షల మంది సభ్యులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పిస్తూ, వారి ద్వారా జిల్లాలోని ప్రతి కుటుంబానికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు.నేడు వరంగల్ జిల్లాలో నిర్వహించడంతో పాటు మరికొద్ది రోజుల్లో హన్మకొండ జిల్లాలో సైతం మత్తు పదార్థాలు వ్యతిరేకంగా విస్తృతంగా సంఘ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వాలంటీర్స్, మెప్మా గ్రూపు సభ్యులు తలచుకుంటే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుంది. ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించడంలో మహిళా సంఘాల సభ్యులు కీలక పాత్ర పోషించాలని , ముఖ్యంగా యువతను కాపాడుకోవడం మనందరి బాధ్యత ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ కు నో.. చెప్పండి - జీవితానికి ఎస్ చెప్పండి.డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాన్ని చేరవేయాలనే ఉద్దేశంతోనే 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని ప్రారంభించాం. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములై పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఐఏఎస్ మాట్లాడుతూ:"డ్రగ్స్ సమస్య కేవలం పోలీస్ శాఖకు సంబంధించిన అంశం కాదని ఇది మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య. అందరం కలిసి కట్టుగా దీనిని ఎదుర్కోవాలి. యువతను సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులు, కుటుంబాలు, విద్యా సంస్థల తో పాటు గ్రామ సమైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలి. అలాగే ప్రతి కుటుంబంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ:"సంఘమిత్ర కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఎస్ హెచ్జి సభ్యుడు తన గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పిస్తూ ఒక సైనికుడిగా పనిచేయాలి. ప్రతి కుటుంబంతో మాట్లాడి డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే ప్రమాదాలను వివరించాలని ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారికి సరైన మార్గదర్శనం చేయాలి.డ్రగ్స్ విక్రయం, సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా గతంలో డ్రగ్స్‌కు బానిసై, అనంతరం వాటిని పూర్తిగా వదిలి సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చిన వ్యక్తి తన అనుభవాలను పంచుకున్నారు.

**ప్రత్యేక వీడియోల ద్వారా అవగాహన**

ముఖ్యమంత్రి ప్రసంగాల వీడియోలు, డీజీపీ సందేశాల వీడియోలు, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ అవగాహన వీడియోల తో పాటు ఇతర ప్రముఖుల డ్రగ్స్ వ్యతిరేక సందేశాల వీడియోలను ప్రదర్శించారు.వీటి ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, యువతపై వాటి ప్రభావం, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరి బాధ్యతపై అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, అడిషనల్ కలెక్టర్ వై. వి. గణేష్, ఐ.ఏ.ఎస్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పిడి డిఆర్డీఓ నాగ పద్మజ, జిల్లా వైద్యాధికారి రాజిరెడ్డి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, గీసుగొండ ఇన్స్ స్పెక్టర్ విశ్వేశ్వర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ భరత్, జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు శ్రీమతి రజిత, టిఎల్ ఎఫ్ అధ్యక్షురాలు పద్మ తో పాటు వెయ్యి కి పై వివిధ మహిళ సంఘాల సభ్యులు, ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి!

- పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేలు ఎక్కడ..?
- స్కూటీలు ఎక్కడ..? తులం బంగారం ఎక్కడ..?
- రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నువ్వేనా..?
- బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి




**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 5 మహా:** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులతో కలిసి ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తామని, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీలు ఇచ్చారని, కానీ వాటి అమలు ఏమైందని ప్రశ్నించారు."విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల సమయంలో మహిళలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు."రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారు..? విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారే లేరా..?" అంటూ ప్రభుత్వంపై ప్రశాంత్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో బీఆర్ఎస్వీ నాయకులు రాజ్ కుమార్, శివ సాయి, జెర్కొని రాజు, నిట్టు జగదీష్,మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి,నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇందిరానగర్‌లో వన మహోత్సవం..

**పెద్దపల్లి జిల్లా మహా, సెప్టెంబర్ 05,** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలోని ఇందిరానగర్‌లో 24వ వార్డులో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పెద్దపల్లి అభివృద్ధి ప్రదాత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్‌పర్సన్ నూగిళ్ల మల్లన్న సహకారంతో వార్డు కౌన్సిలర్ కొట్టే స్వరూప సదానందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వార్డు ప్రజలకు వివిధ రకాల పండ్ల, పూల మొక్కలను పంపిణీ చేశారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ సదానందం, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.




## అసెంబ్లీకి రాని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి

- వజ్రేష్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్
- ఈసీఐఎల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన

**కుషాయిగూడ, మహా:** అసెంబ్లీకి రాని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. శాసనసభకు రాకుండా, ప్రజల సమస్యలపై మాట్లాడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌తో ఎవరికీ కూడా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు.కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదాలో జీతభత్యాల కోసం రూ.1.24 కోట్లు, భద్రత, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, ఇతర వసతుల కోసం మరో రూ. 21 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు అవుతుందని ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాధనంతో ఫామ్ హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగే అర్హత లేదన్నారు. రేపటి నిరసన సభకు భారీగా తరలి రండి... ఇదే డిమాండ్‌తో ఈనెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే నిరసన సభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరా పార్కు వద్ద జరిగే నిరసన సభకు ఉప్పల్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, పజూరి పావని మణిపాల్ రెడ్డి. బొంతు శ్రీదేవి యాదవ్. స్వర్ణరాజ్ శివమణి. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి . సీతారాం రెడ్డి. కొత్త అంజిరెడ్డి. కల్లేపల్లి సదానంద్. రోకలిబండ రామన్న. కుతాడి సాయి విట్టల్ నాయక్. ఎస్సి సెల్, బీసీ సెల్, మైనారిటీ, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# సంప్రదాయ అందంలో ప్రిషా ఆర్ సింగ్

లేత ఆకుపచ్చ, క్రీమ్ రంగుల ఎంబ్రాయిడరీ లెహంగాలో ప్రిషా ఆర్. సింగ్ అందంగా మెరిశారు. లెహంగాపై సున్నితమైన బంగారు, వెండి వర్క్, షీర్ లాంగ్ స్లీవ్స్, జారే దుపట్టాతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా కనిపించింది. మెరిసే మాంగ్‌టిక్కా, స్టేట్‌మెంట్ ఇయరింగ్స్, నడుము చైన్‌తో సంప్రదాయ అందాన్ని ఒలికించారు. గోధుమ రంగు బ్యాక్‌డ్రాప్‌లో గ్రేస్‌ఫుల్ పోజులతో తన అందం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు.ప్రిషా ఆర్. సింగ్ 2020లో విడుదలైన హిందీ చిత్రం 'గులాబో సితాబో'తో నటిగా అరంగేట్రం చేశారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్‌తో కలిసి సహాయ పాత్రలో నటించారు. అనంతరం 2023లో 'స్పై' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన ఈ సినిమాలో రహ్మాన్ కుమార్తె పాత్రలో కనిపించారు.2024లో అల్లు శిరీష్ సరసన నటించిన ఫాంటసీ కామెడీ చిత్రం 'బడ్డీ'తో ప్రిషాకు మరింత గుర్తింపు వచ్చింది. ఇందులో ఆమె ఎయిర్‌హోస్టెస్ పాత్రను పోషించారు. ప్రస్తుతం 2026లో అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'లో నటిస్తున్నారు. ఈ ఫాంటసీ కామెడీలో ప్రిషా ఓ ఊర్వశి పాత్రలో కనిపించనున్నారు. హాస్యం, మ్యాజిక్, లైట్‌హార్టెడ్ డ్రామాతో రూపొందిన ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహించారు.హిందీ, తెలుగు చిత్రాల్లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రిషా తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. వైవిధ్యమైన కథల్లో నటిస్తూ పరిశ్రమలో రైజింగ్ టాలెంట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

# 'సర్దార్ 2'పై కార్తి కీలక వ్యాఖ్యలు

కార్తి హీరోగా తెరకెక్కుతున్న 'సర్దార్ 2'పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. గతంలో మంచి విజయాన్ని అందుకున్న 'సర్దార్'కు కొనసాగింపుగా ఈ చిత్రం రూపొందుతోంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్తి సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.తొలి భాగంలో వాటర్ మాఫియా అంశం ప్రేక్షకులను ఆకట్టుకోగా, 'సర్దార్ 2'లోని కథ అంతకంటే ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని కార్తి పేర్కొన్నారు. భారతీయ నేపథ్యంతో సాగే స్పై కథలు చాలా అరుదుగా వస్తాయని, సాధారణ వ్యక్తిలా కనిపించే ఓ గూఢచారి ఆలోచన తనను కథవైపు ఆకర్షించిందని చెప్పారు. దేశం కోసం వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసే గూఢచారుల జీవితాలను ఇందులో ప్రత్యేకంగా చూపించినట్లు వివరించారు. ఈసారి 'సర్దార్' మళ్లీ రంగంలోకి రావడానికి కారణమే కథలో కీలక అంశంగా ఉంటుందని తెలిపారు.ఈ సినిమాలో ఎస్.జె. సూర్య ప్రతినాయకుడిగా విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని కార్తి వెల్లడించారు. గతంలో 'స్పైడర్' చిత్రంలో సూర్య పోషించిన విలన్ పాత్రకు మంచి గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. అయితే 'సర్దార్ 2'లో ఆయన పాత్రకు మరింత భిన్నమైన కోణాన్ని దర్శకుడు పీఎస్ మిత్రన్ రూపొందించినట్లు కార్తి చెప్పారు. తన పాత్రకు సూర్య స్వయంగా డబ్బింగ్ చెప్పడం కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అన్నారు.సాధారణంగా స్పై సినిమాలు విదేశీ నేపథ్యంతో సాగుతుంటాయని, కానీ 'సర్దార్ 2'లో భారతదేశంలో ఎదురవుతున్న ఓ సమస్యను ఓ గూఢచారి ఎలా ఎదుర్కొన్నాడనే అంశాన్ని ప్రధానంగా తీసుకున్నామని కార్తి వివరించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని, ముఖ్యంగా వృద్ధుడి పాత్రలో యాక్షన్ చేయడం తనకు సవాలుగా అనిపించిందని చెప్పారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ప్రత్యేకంగా వందే భారత్ రైలు సెట్‌ను కూడా రూపొందించినట్లు కార్తి తెలిపారు. ఆశిక రంగనాథన్, మాళవిక మోహనన్ పాత్రలు కేవలం కథానాయికల పాత్రలకే పరిమితం కాకుండా బలమైన, తెలివైన క్యారెక్టర్లుగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. 'సర్దార్' తొలి భాగాన్ని మరోసారి చూసి 'సర్దార్ 2'ను థియేటర్లలో ఆస్వాదించాలని కార్తి ప్రేక్షకులను కోరారు.





# 'కామ్రేడ్ కళ్యాణ్'గా శ్రీవిష్ణు

విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో శ్రీవిష్ణు మరోసారి కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్రంలో ఆయన 'తాడికొండ కళ్యాణ్' అనే వాంటెడ్ నక్సలైట్ పాత్రను పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.

టీజర్‌లో రాష్ట్ర హోం మంత్రిని నక్సలైట్లు అడవిలోకి తీసుకెళ్లడం ప్రధానంగా చూపించారు. తుపాకులతో ఉన్న కామ్రేడ్ల మధ్య హోం మంత్రి బందీగా ఉండగా, కళ్యాణ్ పాత్ర పోలీసులకు సవాల్ విసిరే విధానం ఉత్కంఠను పెంచుతోంది. అంతేకాకుండా హోం మంత్రి భార్యకు ఫోన్ చేసి తన భర్త తమ వద్ద సురక్షితంగా ఉన్నాడంటూ నక్సలైట్ నాయకుడు చెప్పే సన్నివేశం టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ సంభాషణలో కనిపించే వ్యంగ్య హాస్యం శ్రీవిష్ణు సినిమాల్లో ఉండే ప్రత్యేక కామెడీ టచ్‌ను గుర్తు చేస్తోంది.

రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. శ్రీవిష్ణు పాత్రలో యాక్షన్‌తో పాటు భావోద్వేగ కోణం కూడా బలంగా ఉంటుందని టీజర్ సూచిస్తోంది. అడవుల్లో సాయుధ పోరాటం చేసే వ్యక్తి వెనుక ఉన్న పరిస్థితులు, భావోద్వేగాలను కథలో కీలకంగా చూపించినట్లు తెలుస్తోంది. మరోవైపు హీరోయిన్‌తో సాగే ట్రాక్, సత్య కామెడీ సన్నివేశాలు వినోదాన్ని అందించేలా ఉన్నాయి.

రావు రమేష్ హోం మంత్రి పాత్రలో కనిపించనుండగా, అడవుల్లో జరిగే పోరాటాలు, పోలీసుల ఆపరేషన్లు టీజర్‌కు యాక్షన్ ఫ్లేవర్‌ను తీసుకొచ్చాయి. సీతా కర్నాటి, వెంకట కృష్ణ కర్నాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. ముఖ్యంగా నేపథ్య సంగీతం యాక్షన్ సన్నివేశాల తీవ్రతను మరింత పెంచేలా ఉంది.

అసలు కామ్రేడ్ కళ్యాణ్ హోం మంత్రిని ఎందుకు టార్గెట్ చేశాడు? పోలీసుల వేట మధ్య అతని లక్ష్యం ఏమిటి? అడవిలో చోటుచేసుకోబోయే పరిణామాలు ఏంటి? అనే ప్రశ్నలతో టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

# 'టాక్సిక్'కు ఇంగ్లీష్ వెర్షన్ షాక్

యష్‌కు 'కేజీఎఫ్' సినిమాల తర్వాత ఏర్పడిన క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన కొత్త సినిమా వస్తుందంటేనే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటాయి. అదే అంచనాలతో విడుదలైన 'టాక్సిక్' కూడా బాక్సాఫీస్ వద్ద తొలిరోజు అదిరిపోయే ఓపెనింగ్ అందుకుంది. మొదటి రోజే రూ.101 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించడంతో యష్ స్టార్ పవర్ మరోసారి స్పష్టమైంది. అయితే ఆ జోరు ఎక్కువ కాలం కొనసాగలేదు. సినిమాకు మిశ్రమానికి మించి ప్రతికూల స్పందన రావడంతో వసూళ్లపై ప్రభావం పడింది.

ఇదిలా ఉంటే తాజాగా 'టాక్సిక్' ఇంగ్లీష్ వెర్షన్ పరిస్థితి కూడా చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 4న దేశంలోని కొన్ని ప్రధాన నగరాల్లో మాత్రమే ఈ వెర్షన్‌ను పరిమిత షోలతో ప్రదర్శించారు. ముంబై, బెంగళూరు, గురుగ్రామ్, నోయిడాలో కలిపి కేవలం 11 షోలు నిర్వహించినట్లు సమాచారం. ట్రేడ్ లెక్కల ప్రకారం తొలి రోజు దేశవ్యాప్తంగా సుమారు 450 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. దీంతో ఇంగ్లీష్ వెర్షన్ మొదటి రోజు కలెక్షన్ దాదాపు రూ.1.40 లక్షల వద్దే ఆగిపోయినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా గురుగ్రామ్, నోయిడాలో ఆక్యుపెన్సీ చాలా తక్కువగా నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కో నగరంలో 25 కంటే తక్కువ టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ముంబై, బెంగళూరులో మాత్రం కొంత మెరుగైన స్పందన కనిపించినప్పటికీ, మొత్తంగా ఇంగ్లీష్ వెర్షన్‌కు ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ దక్కలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వెర్షన్‌ను సాధారణ సినిమాతో పోలిస్తే దాదాపు 17 నిమిషాలు తగ్గించి కొత్త కట్‌తో విడుదల చేశారు. ఇంగ్లీష్ వెర్షన్ రన్‌టైమ్ సుమారు 2 గంటల 57 నిమిషాలుగా ఉండగా, ఇతర భాషల్లో సినిమా నిడివి ఎక్కువగా ఉంది. కొత్త కట్‌తోనైనా ప్రేక్షకులను ఆకట్టుకోవాలనే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం అంతగా కనిపించలేదని ట్రేడ్ వర్గాల అంచనా.

తొలి రోజు నమోదైన టికెట్ అమ్మకాల పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంగ్లీష్ వెర్షన్ జీవితకాల వసూళ్లు రూ.10 లక్షల మార్కును చేరడం కూడా కష్టమేనని కొన్ని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. అయితే ఈ లెక్కలు ప్రారంభ దశకు సంబంధించినవే కావడంతో తుది వసూళ్లలో మార్పులు ఉండే అవకాశం ఉంది.

ఆగస్టు 26న 'టాక్సిక్' కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలైంది. తొలి రోజే రూ.101.10 కోట్ల నెట్ సాధించడంతో భారీ విజయం ఖాయమనే అంచనాలు వచ్చాయి. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రతికూల టాక్ కారణంగా కలెక్షన్లు క్రమంగా తగ్గాయి. పది రోజుల తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా సుమారు రూ.331 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి. భారతదేశంలో రూ.241.05 కోట్ల నెట్, రూ.287.75 కోట్ల గ్రాస్ నమోదైనట్లు సమాచారం. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.43.25 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనా. భారీ స్థాయి వసూళ్లను ఆశించిన ఈ సినిమాకు ప్రస్తుత కలెక్షన్లు అంచనాలకు దూరంగా ఉండటంతో బాక్సాఫీస్ ఫలితంపై చర్చ కొనసాగుతోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com